మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 216 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## ప్రొ॥ సాయిబాబాకు అంతిమ వీడ్కోలు

### గాంధీ వైద్య కళాశాలకు పార్థివ దేహం అప్పగింత





- తరలివచ్చిన వేలాది మంది ప్రజానికం
- హాజరై నివాళులు అర్పించిన వివిధ పార్టీల నేతలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ప్రొఫెసర్ సాయిబాబా పార్థివదేహానికి పలువురు నివాళులర్పించారు. సీపీఐ నేత నారాయణతో పాటు పలువురు వామపక్ష నేతలు అంజలి ఘటించారు.సాయిబాబా అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. కామ్రేడ్ సాయిబాబా అమర్‌రహే, లాల్ సలాం, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. గన్‌పార్కు వద్ద 5 నిమిషాల సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబసభ్యులు, అభిమానులు కోరగా.. పోలీసులు నిరాకరించారు. సాయిబాబా పార్థివదేహాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి నిర్వహిస్తామని చెప్పినా అనుమతివ్వలేదు. దీంతో సాయిబాబా అభిమానులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతం సాయిబాబా భౌతికకాయాన్ని మౌలాలిలోని ఆయన నివాసానికి తరలించారు.పుస్తకాలు కాకుండా సమాజాన్ని చదివేవారు మేధావులని సీపీఐ నేత నారాయణ అన్నారు. సాయిబాబా అలాంటి వ్యక్తి అని కొనియాడారు. గన్‌పార్కు వద్ద మీడియాతో

మిగతా 2లో..

# పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రోత్సాహం

## ఫాక్స్‌కాన్ కంపెనీ పురోగతిని పరిశీలించిన రేవంత్

- కంపెనీకి అన్ని విధాలా సహకారం అందిస్తాం
- ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టండి
- సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ
- కంపెనీ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్
- కొంగరకలాన్‌లోని కంపెనీ కార్యాలయాన్ని సందర్శించిన సీఎం

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఫాక్స్‌కాన్ సంస్థ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కార్యాలయానికి వెళ్లిన రేవంత్..సంస్థ పురోగతిపై అక్కడి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో మరిన్ని విభాగాల్లో



పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.




### ప్రధాని మోడీతో అతిషి భేటీ

సిఎంగా బాధ్యతలు చేపట్టాక మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడి

వార్తా 2లో..

### ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



వార్తా 3లో..

### హెజ్బొల్లా భీకర దాడి..

ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ దుర్మరణం?



వార్తా 3లో..

## వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణానికి

# ముహూర్తం ఖరారు

- నేడు శంకుస్థాపన చేయనున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- దామగుండం అటవీ ప్రాంతంలో భారత నావికాదళం ఆధ్వర్యంలో ఏర్పాటు
- 2027లో పూర్తి.. ఫలించనున్న భారత నావికాదళం 14 ఏళ్ల ప్రయత్నాలు
- నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న పర్యావరణ వేత్తలు.. మూసీ,ఈసీ నదులకు ప్రమాదమని హెచ్చరిక

వికారాబాద్ (ప్రజా మంటలు):
వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో భారత నావికాదళం నిర్మించనున్న వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో నేవీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గత 14 ఏళ్లుగా ఈ రాడార్ స్టేషన్ నిర్మాణానికి నావికాదళం ప్రయత్నాలు చేస్తోంది. 2010 నుంచి 2023 వరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతూనే ఉంది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ విషయంపై రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఆయన సమక్షంలోనే ఈ ఏడాది జనవరి 24న రిజర్వు ఫారెస్ట్‌లోని 2,900 ఎకరాలను అటవీ అధికారులు నావికా దళానికి అప్పగించారు. దీంతో రాడార్ స్టేషన్‌కు అవసరమైన భూములు అందుబాటులోకి రావడంతో ఈ నెల 15న శంకుస్థాపనకు



ముహూర్తం ఖరారు చేశారు. హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న దామగుండంలోని అటవీ ప్రాంతం మొత్తం 3 వేల 260 ఎకరాల్లో విస్తరించి ఉంది. పూడూరు గ్రామం మీదుగా వెళ్తే ఈ అటవీ పరిధిలోకి వెళ్లొచ్చు. అక్కడ పురాతన కాలం నాటి రామలింగేశ్వర స్వామి దేవాలయం ఉంది.రాడార్ స్టేషన్‌ను నిర్మించనున్న ఈస్టర్న్ నావల్ కమాండ్ : నగరం నుంచి చాలా మంది భక్తులు ఇక్కడికి వచ్చిపోతుంటారు. ఈ ప్రాంతంలో చాలా వరకు సినిమా షూటింగ్స్ కూడా జరుపుకున్నాయి. ఈ అడవిని ఆనుకొని సుమారు 20 వరకు చిన్న పల్లెలు, తండాలున్నాయి. పశువుల మేత, ఇతరత్రా అవసరాలకు స్థానిక ప్రజలు ఈ అడవిపై ఆధారపడుతుంటారు. అడవి మధ్యలో చిన్న చిన్న నీటివనరులు, వాగులు వంకలున్నాయి. ఎంతో అహ్లాదకరంగా ఉండే ఈ అటవీ ప్రాంతంలో జీవవైవిధ్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. పెద్ద జంతువులేవీ లేకపోయినా

మిగతా 2లో..




### వికలాంగుల కోసం జాబ్‌పోర్టల్

- ప్రారంభించిన మంత్రి సీతక్క
- ఉపాధిరంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువ
- సాధారణస్థాయి వారితో పోటీ పడలేక పోతున్నారని వ్యాఖ్య

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువగా ఉన్నాయని.. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇతర వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయని, శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదని అన్నారు. పోషకాహార లోపం, ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుందన్నారు. అందుకే వాళ్లకు ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌ను ప్రారంభించామని మంత్రి తెలిపారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలని, దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ జాబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే చాలని అన్నారు. సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరేట్ హెల్ప్ లైన్‌లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, దివ్యాంగులు, వయోవృద్ధులు,

మిగతా 2లో..

## ప్రజా నాడి




## సమాచారం ఉంటే తెలపండి

- దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనపై ప్రజలకు రైల్వే శాఖ వినతి
- 16,17 తేదీల్లో చెన్నైలో విచారణ

చెన్నై (ప్రజా మంటలు):
ఈనెల 11న తమిళనాడులోని కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును మైసూరు- దర్భంగా ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

మిగతా 3లో..



## రాగల ఐదురోజులు వర్షాలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని.. వాయువ్య దిశగా కదులుతూ మరింత బలంగా మారుతుందని పేర్కొంది. మంగళవారం ఉదయం వరకు మధ్యబంగాళాఖాతం వరకు చేరుతుందని చెప్పింది. ఆ తర్వాత రెండురోజుల్లో మరింత ముందుకు కదులుతూ పశ్చిమ వాయువ దశగా కదులుతూ తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఏపీ తీరాలకు చేరే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల,

మిగతా 3లో..



## పాలిట్రిక్స్

పరిశ్రమల్లో మేరు
పర్వతం రతన్ జీ,
ఓ తరానికి తరగని
స్ఫూర్తి మన టాటాజీ!

దేశానికి గొప్ప విజనరీ
పేదల పాలిట పెన్నిధి,
శ్రమజీవులకు సన్నిధి
భవితకు మీరే సారథి!

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి

## వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు

రకరకాల పక్షులు, జింకలు, దుప్పులు కనిపిస్తాయి. ఇక్కడ అనేక ఔషధ మొక్కలు ఉండటంతో చాలా మంది శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో నిత్యం అన్వేషణ సాగిస్తుంటారు.అలాంటి ఈ అటవీ ప్రాంతంలోని భూముల్లో 2900 ఎకరాలను నేవీకి అప్పగించారు. ఆ భూముల్లో లక్షా 93 వేల చెట్లున్నట్లు గుర్తించారు. మరో 300 నుంచి 400 ఎకరాల్లో గడ్డి భూములున్నాయి. నేవీకి అప్పగించిన భూముల్లోని చెట్లను పూర్తిగా తొలగించబోమని అధికారులు చెబుతున్నారు. అవసరమైతే తొలగించాల్సిన చెట్లను వేళ్లతో సహా పెకిలించి గడ్డిభూముల్లో నాటాలని అటవీ శాఖ అధికారులు ఆలోచిస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న ఈస్టర్న్ నావల్ కమాండ్ దామగుండంలో వీఎల్ఎఫ రాడార్ స్టేషన్?ను నిర్మించబోతుంది. వీఎల్ఎఫ్ అంటే వెరీలో ఫ్రీక్వెన్సీ రాడార్ అంటారు. ఈ రాడార్ వ్యవస్థ ద్వారా సముద్రంలో ఉన్న ఓడలు, జలాంతర్గాముల్లోని సిబ్బందితో సమాచారాన్ని పంచుకోవచ్చు.ఈ వ్యవస్థ 3 కేజీహెచ్జడ్ నుంచి 30 కేజీహెచ్జడ్ రేంజ్‌లో తరంగాలను ప్రసారం చేస్తోంది. నీటిలో 40 మీటర్ల లోతు వరకు ఈ తరంగాలు వెళ్తాయి. అలాగే ఈ వ్యవస్థ వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటికి సిగ్నల్స్ చేరవేయగలదు. రక్షణ రంగంతోపాటు ఇతర రేడియో కమ్యునికేషన్ అవసరాల కోసం ఈ సాంకేతికతను వినియోగిస్తారు. దేశంలో ఇది రెండో అతిపెద్ద స్టేషన్. ఒకటి తమిళనాడులోని తిరునల్వేలో ఉండగా ఇప్పుడు దామగుండంలో రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సముద్రం లేని తెలంగాణలో నేవి రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ఏంటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన ఆరేబియా సముద్రంలో ఉన్న ఓడలు, జలాంతర్గాముల్లోని సిబ్బందితో మాట్లాడటానికి వీలుగా ఈ రెండు ప్రాంతాలకు మధ్యలో ఉన్న తెలంగాణలోని దామగుండం ప్రాంతాన్ని నేవీ ఎంచుకుంది. సముద్ర మట్టానికి 360 ఎడుగుల ఎత్తున ఉండటం అటవీ ప్రాంతం కావడం, హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని నేవి అధికారులు చెబుతున్నారు. దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని పలు పర్యావరణ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. పచ్చదనం, జీవ వైవిధ్యంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.2027 నాటికి అందుబాటులోకి : మూసీ, ఈసీ నదులు ప్రమాదంలో పడతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరానికి వరద ముంపు కూడా ఉండబోతుందని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలకు లేఖలతోపాటు న్యాయస్థానాల్లో అనేక కేసులు దాఖలయ్యాయి. మరోవైపు ఈ స్టేషన్?కు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు కూడా దశాబ్దకాలంగా దామగుండం అటవీ సంరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ పేరుతో పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. సుమారు 2500 కోట్ల రూపాయలతో ఈ రాడార్ స్టేషన్?ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. 2027 నాటికి ఈ స్టేషన్?ను అందుబాటులోకి తీసుకురావాలని నేవీ అధికారులు భావిస్తున్నారు.

# రాడార్ సెంటంత్‌తో మూసీ ఉనికి అంతర్ధానం

**- ఓవైపు సుందరీకరణ అంటూ మరో వైపు మరణశాసనమా!**

**- ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారు**

**- వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుపై కెటిఆర్ ఆగ్రహం**



గంగోత్రికి ఒక న్యాయం, మా మూసీ నదికి మరో న్యాయమా

హైదరాబాద్, (ప్రజా మంటలు): వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేయడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో దీనిని రాకుండా చూశామని అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ పేరుతో లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే మరోవైపు మూసీ నదిని పూర్తిగా ప్రమాదంలో పడేసే రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడమేమిటని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదెక్కడి ద్వంద్వ వైఖరంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏం ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తుండటాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. రామగుండంలో రాడార్ ఏర్పాటు కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ చెప్పారు. దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగంతో పాటు 12 లక్షల చెట్లను నరికివేసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారన్నారు. జనవాసాలే లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఎందుకు తెలంగాణలో నిర్మిస్తున్నారో చెప్పాలన్నారు. మాట్లాడితే మూసీ పరిరక్షణ అని చెబుతున్న ముఖ్యమంత్రి మూసీనే ప్రమాదంలో పెట్టే ఈ ప్రాజెక్ట్‌కు ఎందుకు అంగీకారం తెలిపారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ తమ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలపలేదని కేటీఆర్ గుర్తు చేశారు. దేశంలోనే అటవీ సామర్థ్యాన్ని పెంచేందుకు హరితహారం చేపట్టి అటవీ విస్తీర్ణాన్ని బీఆర్ఎస్ సర్కార్ పెంచిందన్నారు. అలాంటిది రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగాన్ని నాశనం చేసేలా చర్యలు చేపట్టడమేమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గంగోత్రికి ఒక న్యాయం, మా మూసీ నదికి మరో న్యాయమా అంటూ నిలదీశారు. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానంలోనే ఉందన్నారు. నది పుట్టిన ప్రాంతాన్ని 'ఎకో సెన్సిటివ్ జోన్'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నది అంతర్ధానం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సోర్స్ అఫ్ ద రివర్'పై ఇది గొడ్డలి పెట్టని చెప్పారు. మూసీ నది పురుడు పోసుకున్న చోట 12 లక్షల చెట్ల నరికివేతతో కోలుకోలేని అనర్థం జరుగుతుందన్నారు. పర్యావరణ సమతుల్యతకు పెను ప్రమాదాన్ని సృష్టించే ఈ ప్రాజెక్ట్‌ను విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం.. ÷జౌసీ నదిని ఫణంగా పెట్టేందుకు సహకరిస్తూ మరో వైపు మూసీ పరిరక్షణ అంటూ ముఖ్యమంత్రి డ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మూసీ పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాడార్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకారం తెలిపేది కాదన్నారు. మూసీ పేరుతో వేల కోట్ల దోపిడీ చేయాలన్న ఆలోచనే తప్ప నిజంగా నది పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందుంటుంది కానీ జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి నష్టం చేస్తామంటే అంగీకరించమని చెప్పారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### ప్రొ॥ సాయిబాబాకు

# అంతిమ వీడ్కోలు

**గాంధీ వైద్య కళాశాలకు పార్థివ దేహం అప్పగింత**

ఆయన మాట్లాడారు. సాయిబాబాను పదేళ్లు అన్యాయంగా జైల్లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దోషి ఎవరో తేల్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తికి లేఖ రాస్తామని నారాయణ చెప్పారు. సాయిబాబా భౌతిక కాయానికి మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కోదండరామ్ నివాళి అర్పించారు. జైలు నుంచి వచ్చిన కొన్నాళ్లకే సాయిబాబా మరణించడం బాధాకరమని హరీశ్‌రావు అన్నారు. సమాజంలో మార్పు, హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. హక్కుల కోసం పోరాడేవారిపై అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. సాయిబాబాపై కేంద్రం అణచివేత ధోరణితో వ్యవహరించిందని కోదండరామ్ తెలిపారు. ఆయన మృతికి కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలు కోసం సాయిబాబా పోరాడారని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులంతా ఆయన నిర్బంధాన్ని ఖండించారని కోదండరామ్ గుర్తుచేశారు.

# వికాలాంగుల కోసం జాబ్‌పోర్టల్

సాధికారత శాఖా జేడీ శైలజ, వికలాంగ సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయని, అందుకోసమే పోస్టల్‌లో అందుబాటులోకి తెచ్చామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సంక్షేమ నిధుల నుంచి ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నామని, ప్రైవేట్ ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రయత్నిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. గతంలో ఒక శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి పెంచెందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు పాటిస్తామని చెప్పారు. సంక్షేమం, విద్యా, ఉద్యోగ రంగంలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని స్పష్టం చేశారు. దివ్యాంగుల పరికరాల కోసం ఈ ఏడాది బ్జడెట్లో రూ. 50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దివ్యాంగులు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా మాకే.. వారి సమస్యలను షేర్ చేయొచ్చునని, మెసేజ్ పాస్ చేస్తే చాలని.. వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలుపెట్టామని మంత్రి సీతక్క తెలిపారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం చేయూతనిస్తామని చెప్పారు. కాగా మహిళా శిశు సంక్షేమ డైరెక్టరేట్ కాల్ సెంటర్లో పదిమంది దివ్యాంగులకు మంత్రి సీతక్క అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేశారు.

# ప్రధాని మోడీతో అతిషి భేటీ

**సిఎంగా బాధ్యతలు చేపట్టాక మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడి**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): నరేంద్ర మోదీని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషిసోమవారంనాడు కలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆమె ప్రధానిని కలుసుకున్నారు. సమావేశం ఎజెండా ఏమిటనేది మాత్రం వెంటనే తెలియలేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం కేటాయింపుపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు, ప్రభుత్వానికి మధ్య మాటల యుద్ధం నడుస్తున్న తరుణంలో ప్రధానితో అతిషి సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రధానిని ఢిల్లీ సీఎం కలుసుకున్నట్టు పీఎంఓ ఒక ట్వీట్‌లో ధ్రువీకరించింది. అయితే ఇంతకు మించిన సమాచారం ఏదీ తెలియజేయలేదు. ప్రధానితో సమావేశమైనట్టు 'ఎక్స్' వేదకగా అతిషి తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రం సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎక్సైజ్ పాలసీ కుంబకోణంలో ఐదు నెలల జైలు అనంతరం బెయిలుపై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ తన సీఎం పదవికి రాజీనామా చేయడంతో అతిషి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు.

# కెనడాది దుందుడు చర్య

**- భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మతో సహా దౌత్యవేత్తలను అనుమానితులుగా పేర్కొనడంపై కేంద్రం తీవ్ర ఆగ్రహం**

**- ఆ దేశ దౌత్యవేత్తకు సమన్లు - ట్రూడోవి ఓటుబ్యాంకురాజకీయాలు**

**- కెనడా ప్రభుత్వంపై మాకు విశ్వాసంలేదు**

**- దౌత్య వెనక్కి పిలిపిస్తామని వెల్లడి**

**- తాజా చర్యలతో మరింత దిగజారిన ఇరు దేశాల సంబంధాలు**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ట్రూడో సర్కారు ఓటు బ్యాంక్ రాజకీయాలతో భారత్–కెనడా సంబంధాలు మరింత దిగజారాయి. ఇటీవల భారత హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను దర్యాప్తులో భాగంగా 'పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్'లుగా (అనుమానితులుగా) పేర్కొంటూ కెనడా నుంచి మన విదేశాంగ శాఖకు సమాచారం అందింది.ఈ ఆరోపణలపై న్యూదిల్లీ తీవ్రంగా స్పందించింది. ఇవి పూర్తి అసంబద్ధమైనవని పేర్కొంది. ఓటు బ్యాంక్ రాజకీయాలతో నడిచే ట్రూడో సర్కారు అజెండాకు అనుకూలంగా ఉన్నాయని మండిపడింది. కెనడా చర్యతో.. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును అనుమానితుల జాబితాలో చేర్చినట్లైంది. 2023లో ఆ దేశ ప్రధాని ట్రూడో ఆరోపణలు చేసిన నాటి నుంచి వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలను భారత్‌తో పంచుకోలేదని విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే తాము పలు మార్లు ఆ దేశ సర్కారును అభ్యర్థించామని వెల్లడించింది. రాజకీయ లబ్ధికోసమే తాజాగా ఎటువంటి ఆధారాలు లేకుండా భారత్‌పై విమర్శలు చేస్తున్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేసింది.ఆ దేశ ప్రధాని ట్రూడో 2018 నుంచే భారత్‌తో ఘర్షణాత్మక వైఖరిని అవలంభిస్తున్నట్లు ఆధారాలున్నాయ విదేశాంగ శాఖ ప్రకటనలో పేర్కొంది. భారత్‌లో వేర్పాటువాదాన్ని ఎగదోసేవారిని ఆయన మంత్రి వర్గంలో చేర్చుకొనడాన్ని గుర్తుచేసింది. దీనికి తోడు 2020లో భారత రాజకీయాల్లో ట్రూడో నేరుగా జోక్యం చేసుకొనే యత్నం చేశారంది. భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మకు 36 ఏళ్ల దౌత్య అనుభవం ఉందని విదేశాంగశాఖ వెల్లడించింది.ఆసియాన్ సమావేశాల సందర్భంగా లావోస్‌లో భారత ప్రధాని మోదీ, కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయినట్టు సమాచారం. అయితే ఇరువురి మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని భారత్ స్పష్టంచేసింది. కేవలం వారిద్దరూ ఎదురుపడ్డారని భారత్ అధికారులు తెలిపారు. అక్కడ భారత వ్యతిరేక కార్యకలాపాలపై కెనడా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేవరకు, పరిస్థితి సాధారణస్థితికి చేరుకోవడం కష్టం" అని అప్పట్లోనే విదేశాంగశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

**ఎవరీ సంజయ్ కుమార్ వర్మ..?**

ప్రధాని జస్టిన్ ట్రూడో వైఖరితో భారత్–కెనడా మధ్య సంబంధాలు తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసు దర్యాప్తులో భాగంగా భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ సహా పలువురు దౌత్యవేత్తలను 'పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్'లుగా (అనుమానితులుగా) పేర్కొంటూ ట్రూడో సర్కార్ తీసుకున్న నిర్ణయంపై భారత్ భగ్గుమంది. ఈ ఆరోపణలు కెనడా ప్రభుత్వపు ఓటు బ్యాంకు రాజకీయాలకు అద్దం పడుతున్నాయని తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. నిజ్జర్ హత్యకేసు విషయంలో భారత ప్రభుత్వ వైఖరిని సంజయ్ కుమార్ వర్మ స్పష్టంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. సంజయ్.. 1988 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారిన్ సర్వీస్)అధికారి. పట్నా యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. అనంతరం ఐఐటీ దిల్లీలో ఉన్నతవిద్యను పూర్తిచేశారు. ఫిజిక్స్‌లో పట్టా పొందారు. ఐఎఫ్ఎస్‌లో అడుగుపెట్టిన తర్వాత హాంకాంగ్, చైనా, వియత్నాం, తుర్కియే, ఇటలీలో దౌత్య సేవలు అందించారు. రిపబ్లిక్ ఆఫ్ సుడాన్‌లో ఇండియన్ అంబాసిడర్‌గా పనిచేశారు. తర్వాత భారత విదేశాంగ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. జపాన్, మార్షల్ ఐలాండ్స్‌లోనూ విధులు నిర్వర్తించారు. సెప్టెంబర్ 2022లో కెనడాలో భారత హైకమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇలా దౌత్యపరంగా మూడు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఆయన సొంతం.గత ఏడాది జూన్‌లో ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీశాయి. అవన్నీ నిరాధారమైన, కుట్రపూరిత ఆరోపణలేనని కొట్టిపారేసిన సంగతి తెలిసిందే. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఒత్తిడికి లోనవుతోన్న తరుణంలో సంజయ్ కుమార్ వర్మ, ఇతర దౌత్య సిబ్బంది అక్కడ సేవలు కొనసాగిస్తున్నారు.ఇదిలా ఉంటే.. ఆసియాన్ సమావేశాల సందర్భంగా లావోస్‌లో భారత ప్రధాని మోదీ, కెనడా ప్రధాని ట్రూడో భేటీ అయినట్టు సమాచారం. అయితే ఇరువురి మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని భారత్ స్పష్టంచేసింది. కేవలం వారిద్దరూ ఎదురుపడ్డారని భారత్ అధికారులు తెలిపారు. "అక్కడ భారత వ్యతిరేక కార్యకలాపాలపై కెనడా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేవరకు, పరిస్థితి సాధారణస్థితికి చేరుకోవడం కష్టం" అని అప్పట్లోనే విదేశాంగశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

**కెనడా దౌత్యవేత్తకు సమన్లు**

ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యకేసులో ఇటీవల భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ సహా పలువురు దౌత్యవేత్తలను 'పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్'లుగా (అనుమానితులుగా) కెనడా పేర్కొనడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది.అవి అసంబద్ధ చర్యలుగా మండిపడింది. ఈ క్రమంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చర్యలను వ్యతిరేకిస్తూ భారత్‌లోని కెనడా దౌత్యవేత్తకు తాజాగా సమన్లు జారీ చేసింది.ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును కెనడా అనుమానితుల జాబితాలో చేర్చింది. వీటిని తప్పుపట్టిన భారత్.. ఈ ఆరోపణలు కెనడా ప్రభుత్వపు ఓటు బ్యాంకు రాజకీయాలకు అద్దం పడుతున్నాయని తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే భారత్‌లోని కెనడా రాయబారి స్టీవర్ట్ వీలర్‌కు సమన్లు జారీచేసింది. నిజ్జర్ హత్యకేసు విషయంలో భారత ప్రభుత్వ వైఖరిని సంజయ్ కుమార్ వర్మ స్పష్టంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

# సమాచారం ఉంటే తెలపండి

ఈ నెల 16, 17వ తేదీల్లో భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై చెన్నైలో రైల్వే ఉన్నతాధికారులు దర్యాప్తు చేయనున్నారని రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఘటనకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే ప్రజలు తమను సంప్రదించాలని దక్షిణ రైల్వే సోషల్ మీడియా వేదికగా ప్రకటన వెలువరించింది. రైలు ప్రమాదంపై అధికారులు భిన్న కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి కారణం సాంకేతిక లోపమా? సిగ్నలింగ్ వైఫల్యమా? కుట్ర కోణమా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎవరి వద్ద అయినా ఆధారాలు ఉంటే..వాటితో పాటు చట్టబద్ధమైన విచారణకు హాజరు కావాలని కోరారు. కాగా ఈ కేసు విచారణ పార్క్ టౌన్‌లోని చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) కార్యాలయంలో రైల్వే భద్రత కమిషనర్ నేతృత్వంలో జరగనున్నట్లుగా వెల్లడించారు. మైసూరు నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా బిహార్‌లోని దర్భాంగ వెళ్లాల్సిన భాగమతి ఎక్స్‌ప్రెస్ (12578) రైలు శుక్రవారం వేగంగా వచ్చి తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలును ఢీకొన్న విషయం తెలిసిందే. దీంతో 13 కోచ్‌లు పట్టాలు తప్పాయి. కొన్ని చెల్లాచెదురుగా పడిపోగా, మరికొన్ని ఒకదాని పైకి మరొకటి ఎక్కాయి. ఈ ప్రమాదంపై స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు తిరువళ్లూరు పోలీసులు నాలుగు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనకు గల కారణాలను తెలుసుకోవడానికి ఎన్ఐఏతో సహా వివిధ ఏజెన్సీల బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి.

# రాగల ఐదురోజులు వర్షాలు

## వాతావరణకేంద్రం హెచ్చరిక

నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలుపడుతాయని చెప్పింది. మంగళవారం నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# మూసీ పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు

## - నవంబర్ 1నుంచి బిజెపి ఉద్యమబాట

## - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

వరంగల్ (ప్రజా మంటలు):




:నవంబర్ 1 నుంచి బీజేపీ ఉద్యమ బాట పట్టనుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 10 సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రం వెనుకబడిందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ సరిగా పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ తరహాలోనే వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి విమర్శించారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2014 లో బీజేపీ సభ్యత్వ సేకరణ తర్వాత 2024 లో చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. నూతనంగా గ్రామీణ మండల జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీ సేకరణ ఏర్పాటు చేస్తామన్నారు.పేదలకు ఇళ్లు కట్టకుండా పేదల ఇళ్లను కూల్చేన్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం కూడగట్టుకుందని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో రూ.లక్ష 80 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ఇంతవరకు డీపీఆర్ తయారు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతతోనే హర్యానా రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సహకరించకుండా ముందుకు పోనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్ లో బీజేపీకి గణనీయంగా ఓట్ల శాతం పెరిగిందని పార్టీని కొనియాడారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి అధిక ఓట్లు రావడం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భద్రాచలం, రామప్ప, జోగులాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెయ్యి స్తంభాల మండపంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించా మన్నారు. దేశ వ్యాప్తంగా 150 దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం. ఇప్పుడు యువత కూడా పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోంది. పెద్దలపై గౌరవం, దేశభక్తి, సమాజంపై బాధ్యత పెంచుకోవాలి. మరింత అంకితభావం, చిత్తశుద్ధితో దేశాభివృద్ధికి కృషి చేస్తాం. మోదీ ప్రభుత్వ హయాంలోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# పట్టుకెళ్లి కాల్చి చంపారు

## - ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టుల లేఖ విడుదల

ఖమ్మం(ప్రజా మంటలు):



ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. దంతెవాడ నారాయణపూర్ ఎన్ కౌంటర్‌లో 31 మంది మావోయిస్ట్‌లు అమరులయ్యారని.. గోవాడి, బొండోస్, తుల్తులి అటవీ ప్రాంతంలో ఎన్ కౌంటర్ జరిగిందని, కార్పొరేట్ మైనింగ్ కంపెనీల కోసం పోలీసులు ఆపరేషన్ కగార్ నిర్వహించారని పేర్కొంది. అక్టోబర్ 4వ లేదీ ఉదయం 11.30 నుంచి రాత్రి 9 గంటల వరకు 11 సార్లు భద్రతా బలగాలు కాల్పులు జరిపారని.. ఎదురు కాల్పులు ల్లో 14 మంది మావోయిస్ట్‌లు అమరులు అయ్యారని, మరుసటి రోజు ఉదయం అక్టోబర్ 5న కాల్పుల్లో గాయపడ్డ 17 మందిని పట్టుకుని హత్య చేశారని పేర్కొంది. తూర్పు బస్తర్ డివిజన్ కమిటీని అంతం చేయడానికి ఫాసిస్ట్ పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడింది. అమరవీరుల ఆశయాలను స్మరించుకుంటూ విప్లవోద్యమం ముందుకు తీసుకు వెళతామని స్పష్టం చేసింది. తూర్పు బస్తర్ డీవిజన్ కమిటీ పేరుతో మావోయిస్ట్ పార్టీ లేఖ విడుదల చేసింది. కాగా అబూజ్‌మడ్ అడవుల్లో

శుక్రవారం అంటే అక్టోబర్ 4 జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు శనివారం దంతెవాడ జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ బస్తార్ ఐజీ పి. సుందర్‌రాజన్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల్లో 13 మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు. మృతులంతా ఇంద్రావతి ఏరియా కమిటీ పీఎల్‌జీఏ 6 బెటాలియన్ సభ్యులని తెలిపారు. మృతుల్లో ఇప్పటివరకు 15 మందిని పోలీసులు గుర్తించారు. వీరిపై రూ.1.30 కోట్లు రివార్డు ఉందని ఐజీ తెలిపారు. ఇంకా 16మంది మావోయిస్టులను గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో మావోయిస్టులకు చెందిన 30 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అబూజ్‌మడ్ అడవుల్లో సుమారు 50 నుంచి 70 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు సమాచారం రావడంతో ఎస్టీఎఫ్, బీఎస్ఎఫ్, బీఆర్‌జీ బలగాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నేందూరు, తూలితూలి అడవుల్లోకి జవాన్లు చేరుకోగానే మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని, ప్రతిగా బలగాలు ఎదురు కాల్పులు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కాల్పులు జరిగాయన్నారు. క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో ఒక ఐఎంజీ మిషన్‌గన్, 4 ఏకే 47గన్స్, ఇతర తుపాకులు, బులెట్లు, బీజీయల్స్, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ తెలిపారు. దండకారణ్య కమిటీ సభ్యురాలు నీతి అలియాస్ ఉర్మిళపై రూ.21లక్షల రివార్డు ఉందని ఐజీ తెలిపారు. ఇప్పటికి గుర్తించిన వారిలో తెలంగాణ రాష్ట్రాని చెందిన వారు ఎవరూ లేరని, మిగతా వారి గుర్తించి వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగిస్తామని వెల్లడించారు.

# డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి

## - తెలంగాణలోనే కొనసాగించండి - క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు


హైదరాబాద్ (ప్రజా మంటలు):



తెలంగాణ కేడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులను డీవోపీటీ ఏపీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నలుగురు ఐఏఎస్ అధికారులు సోమవారం కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన వేర్వురుగా క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని ఐఏఎస్ అధికారులు కోరారు. తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అధికారుల పిటిషన్లపై క్యాట్ మంగళవారం విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఏపీ విభజన నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేంద్రం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేంద్రం సర్దుబాటు చేసింది. ఈ సమయంలో ఐఏఎస్ అధికారులను ఏపీ, తెలంగాణ కేడర్‌లకు కేటాయించింది. అయితే, ఇందులో కొందరు అధికారులు తమను ఏపీ కేడర్‌కు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ కేడర్‌గా గుర్తించాలని కోరుతూ పలు కారణాలను చూపించారు. అయితే, ఈ విషయంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ క్యాట్‌ను ఆశ్రయించగా.. అధికారుల అభ్యర్థనను క్యాట్ పరిగణలోకి తీసుకున్నది. అయితే, ఈ తీర్పును డీఓపీటీ తెలంగాణ హైకోర్టు సవాల్ చేసింది. 2023 మార్చిలో పిటిషన్‌పై విచారించింది. అధికారుల అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో దీపక్ ఖండేకర్ ఏకసభ్య కమిషన్‌ను కేంద్రం ఈ ఏడాది మార్చి 21న ఏర్పాటు చేసింది. కమిటీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అభ్యర్థనలను పరిశీలించింది. వ్యక్తిగతంగానూ విచారించి.. అభ్యర్థలను తిరస్కరించింది. ఈ క్రమంలో డీఓపీటీ ఏపీ కేడర్‌కు కేటాయించిన ఆలిండియా సర్వీస్ అధికారులను ఏపీ కేడర్‌కు వెళ్లాల్సిందిగా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని డీఓపీటీ స్పష్టం చేసింది. అయితే, డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ నలుగురు అధికారులు క్యాట్‌ని ఆశ్రయించారు.

# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

## సమాజ శ్రేయస్సులో విశేష కృషి చేసినందుకు డారన్ ఏస్మోగ్లు, సిమన్ జాన్సన్, రోబిన్‌సన్‌లకు పురస్కారం



స్టాక్‌మోమ్(ప్రజా మంటలు):
ఆర్థికశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి వరించింది. రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ అవార్డును ప్రకటించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డారన్ ఏస్మోగ్లు, సిమన్ జాన్సన్, యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన జేమ్స్.ఎ.రోబిన్‌సన్‌లకు ఈ యేటి ఎకనామిక్స్ నోబెల్ దక్కింది. సమాజ శ్రేయస్సును నిర్ణయించడంలో సంస్థల పాత్రపై వీరు చేసిన అధ్యయనానికి గానూ నోబెల్ బహుమతి దక్కింది. గతేడాది కూడా ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం దక్కింది. బెన్ ఎస్ బెర్నాంకి, డగ్లస్ డబ్ల్యూ. డైమండ్, ఫిలిప్ హెచ్.డిబ్విగ్‌లు నోబెల్‌ను అందుకున్నారు. బ్యాంకులు, ఆర్థిక సంక్షోభాలపై ఈ ముగ్గురు పరిశోధనలు చేశారు. ఆర్థిక సంక్షోభాల వేళ బ్యాంకుల పాత్ర ఎంత ముఖ్యమైందన్న విషయాన్ని ఈ ముగ్గురూ తమ పరిశోధనల్లో వెల్లడించారు. బ్యాంకులు దివాళా తీయకుండా ఉండేందుకు ఈ స్టడీ చాలా కీలకమైందని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది. కాగా, స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న విషయం తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నెబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన జ్ఞాపకార్థం ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాల్లో, సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించారు. ఈ అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్ (10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది.

# హెజ్బొల్లా భీకర దాడి..

## ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ దుర్మరణం?

లెబనాన్(ప్రజా మంటలు):
ఏడాదిగా సాగుతున్న హమాస్–ఇజ్రాయెల్ యుద్ధంలో కీలక మలుపు. ఇటీవలి కాలంలో హమాస్ ను వదిలేసి లెబనాన్ ఉగ్ర సంస్థ హెజ్బొల్లాను టార్గెట్ చేసిన ఇజ్రాయెల్ కు భారీ షాక్.. ఎవరూ ఊహించని విధంగా.. కనీసం కలలో కూడా తలచుకోని రీతిగా ఇజ్రాయెల్ కు ఎదురుదెబ్బ తగిలింది. అది కూడా ఏకంగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) చీఫ్ మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే గనుక తీవ్ర పరిణామాలే ఉంటాయి. అమెరికా నుంచి శ్రీలంక వరకు ప్రపంచంలో ఎన్నో దేశాలకు సైన్యాలు ఉండొచ్చు. కానీ, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐపీఎఫ్) మాత్రం అత్యంత మేటి అని చెప్పక తప్పదు. చాలా చిన్న దేశానికి చెందినదే అయినా..ఐడీఎఫ్ చూపే తెగువ మామూలు స్థాయిలో ఉండదు. అయితే, తాజాగా ఐడీఎఫ్ చీఫ్ నే హతమార్చింది హెజ్బొల్లా అని అంటున్నారు. ఆ దేశంలోని బిన్యమిన ప్రాంతంలో ఉన్న సైనిక స్థావరమే లక్ష్యంగా హెజ్‌బొల్లా మానవ రహిత విమానాలు చేసిన దాడిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు చనిపోయారని, దాదాపు 67 మంది గాయపడినట్లు తెలుస్తోంది. అయితే, ఐడీఫ్ అధిపతి, లెఫ్టినెంట్ జనరల్ హెర్జిహలేవి కూడా మృతుల్లో ఉన్నట్లు ప్రచారం మొదలైంది. అమెరికా కామెంటేటర్ జాక్సన్ హింక్లె సైతం దీనిని ప్రస్తావించడంతో గగ్గోలు రేగింది. ధ్రువీకరించిన (వెరిఫైడ్) ఎక్స్ ఖాతాల్లోనూ ఇదే ప్రచారమైంది. అయితే, కొద్దిసేపటి తర్వాత ఈ ప్రచారం తప్పంటూ జెరూసలెం పోస్టు కథనం ప్రచురించింది.హెజ్బొల్లా మానవ రహిత విమానాలు/డ్రోన్లు చేసిన దాడి ఇప్పటివరకు ఇజ్రాయెల్ పై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. ఈ ప్రదేశం ఐడీఎఫ్ గోలాన్ బ్రిగేడ్ ట్రైనిస్ సెంటర్ లోని మెస్ గా చెబుతున్నారు. కాగా, డ్రోన్ల దండుగా రావడంతో ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఏం చేయలేకపోయినట్లు తెలుస్తోంది. ఐడీఎఫ్ ప్రతినిధి హగారీ మాత్రం.. యుద్ధంపై తమకు పూర్తిగా పట్టు ఉందని ప్రకటించారు. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను మానవ రహిత విమానం ఎలా తప్పించుకొందో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.లక్షన్నర రాకెట్లు హెజ్బొల్లా సొంతం. అయితే, దాని దగ్గర ఉన్న మిర్సాద్–1 రకం చాలా కీలకంగా చెబుతారు. దీంతోనే తాజాగా దాడి చేసిందని తెలుస్తోంది. 3 వేల మీటర్ల ఎత్తు దాకా ఎగురుతూ 40 కేజీల పేలుడు పదార్థాలతో ఈ డ్రోన్ 120 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై గంటకు 370 కిలోమీటర్ల వేగంతో దాడి చేస్తుందట. ఇరాన్ సూసైడ్ డ్రోన్ మొహాజిర్–2 శ్రేణికి చెందినది మిర్సాద్–1.. హెజ్‌బొల్లా ప్రధాన డ్రోన్. రెండేళ్లుగా వాడుతోంది. ఉగ్ర సంస్థ భారీ సంఖ్యలో రాకెట్లతో కలిపి మిర్సాద్–1 డ్రోన్లను ప్రయోగించిందని.. అందుకే ఇజ్రాయెల్ అడ్డుకోలేకపోయిందని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను డ్రోన్లు తప్పించుకోవడం తొలిసారి అని ఇజ్రాయెల్ చెప్పింది. తమ డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ చనిపోతే ఇజ్రాయెల్ ప్రతీకారం ఎలా ఉంటుందో ఊహించలేం.. దీనికి అమెరికా కూడా తోడుగా వస్తుంది. అసలే ఇరాన్ పై రేపోమాపో దాడి చేసేలా, వారి అణు స్థావరాలను లక్ష్యం చేసుకునేలా ఉంది ఇజ్రాయెల్. ఈ క్రమంలో ఐడీఎఫ్ చీఫ్ మరణం వారిని విపరీతంగా రెచ్చగొట్టినట్లే అవుతుంది.

# డోనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం

## - రెండు గన్‌లతో సంచరించిన వ్యక్తి అరెస్ట్

న్యూయార్క్ (ప్రజా మంటలు):అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పై మరోసారి హత్యాయత్నానికి ప్రయత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల కాలిఫోర్నియాలోని కోచెల్లాలో నిర్వహించిన ట్రంప్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి రెండు గన్‌లతో సంచరిస్తున్నట్లుగా తమకు సమాచారం అందిందని సీక్రెట్ సర్వీసెస్ పేర్కొన్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, అతడిని లాస్‌వెగాస్‌కు చెందిన వేం మిల్లర్(49)గా గుర్తించామని పోలీసులు పోలీసులు పేర్కొన్నారు. అయితే ట్రంప్‌నకు, ర్యాలీకి హాజరైన వారికి గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని వెల్లడించారు. నిందితుడు నకిలీ ప్రెస్‌కార్డు, ఎంట్రీ పాస్‌తో ర్యాలీ వేదికకు సమీపంలో లోడ్ చేసిన షాట్‌గన్, హ్యాండ్‌గన్, హై కెపాసిటీ గల మ్యాగజైన్‌తో తిరుగుతుండగా, అతడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా నిందితుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే మితవాద సంస్థలో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సీక్రెట్ సర్వీసెస్ సహాయంతో ట్రంప్‌పై జరగబోయే మరో హత్యాయత్నాన్ని ఆపగలిగామని అన్నారు. రివర్‌సైడ్ కౌంటీ షెరీఫ్ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం నిందితుడు శనివారమే జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడని, అతడి వాహనానికి కూడా రిజిస్ట్రేషన్ లేదని పేర్కొన్నారు. కారులో మందుగుండు సామగ్రి, తుపాకులు లభించాయన్నారు. నకిలీ పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ సైతం ఉండటం తో హత్య అనంతరం విదేశాలకు పారిపోవడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. అయితే విచారణలో భాగంగా నిందితుడు మాట్లాడుతూ.. తనపై వస్తున్న ఆరోపణలను కొట్టిపడేశాడు. తాను ట్రంప్‌నకు మద్దతుదారుడినని పేర్కొన్నాడు. తన వద్ద ఉన్న ఆయుధాలను 2022లో వ్యక్తిగత రక్షణ కోసం కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. వాటిని తీసుకొని బట్లర్ ప్రాంతం మీదుగా వెళ్తున్న సమయంలో పోలీసులు దాడి చేసి, బలవంతంగా తన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని నిందితుడు ఆరోపించాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దుండగులు పలుమార్లు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గత జులైలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో ప్రచార సభ నిర్వహించారు. ఆ సమయంలో థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకుడు ట్రంప్‌పై కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి తూటా దూసుకెళ్లింది. వేగంగా స్పందించిన అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ఆయన్ను కాపాడారు. మరోసారి ఎ÷–లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ట్రంప్‌పై హత్యాయత్నం చోటుచేసుకుంది.

# యూపీలో కలకలం

## - దుర్గామాత ఊరేగింపులో కాల్పులు..

## - ఒకరు మృతి, షాపులు, వాహనాలు దగ్ధం!

## - ఉత్తర్ ప్రదేశ్ భైరాచ్ జిల్లాలో ఘటన

భైరాచ్ (ప్రజా మంటలు): దసరా పండుగ సందర్భంగా దుర్గామాత ఊరేగింపులో హింస చెలరేగింది. ఈ హింసలో తుపాకీ కాల్పులు జరిగి ఒక వ్యక్తి మరణించగా.. నిందితులు వాహనాలు, షాపులకు నిప్పంటించారు. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలలోని భైరాచ్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. భైరాచ్ జిల్లాలోని మహసీ మండలంలో ఆదివారం దసరా పండుగ ముగింపు వేడుకల్లో భాగంగా కొందరు దుర్గామాత ఊరేగింపు చేశారు. అయితే ఊరేగింపులో జోరుగా డీజె సంగీతం పెట్టారు. అలా ఊరేగింపు తీసుకెళ్లే మార్గంలో ముస్లిం జనాభా ఉన్న ప్రాంతం వచ్చింది. ఆ ప్రాంతానికి చేరుకోగానే ముస్లిం వర్గానికి చెందిన కొందరు ఊరేగింపు డీజె మ్యూజిక్ తగ్గించాలని చెప్పారు. అలా చేయడం కుదరదని ఊరేగింపు వర్గం చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంతో ఇరు వర్గాల మధ్య గొడవ పెరిగి దాడులు జరిగాయి. ఇంతలో వెనుక నుంచి ఎవరో తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక బుల్లెట్ తగిలి రామ్ గోపాల్ మిశ్రా అనే 22 ఏళ్ల ఒక వ్యక్తి మరణించగా.. కొందరికి గాయాలయ్యాయి. దీంతో గొడవలో హింస చెలరేగింది. ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. గుర్తు తెలియని కొందరు పరిసరాల్లోని బైకులు, ఇళ్లు, షాపులకు నిప్పంటించారు.బుల్లెట్ గాయంతో పడిపోయిన రామ్ గోపాల్ మిశ్రాని ఆస్పత్రికి తరలించగా.. డాక్టర్లు అతను చనిపోయాడని ధృవీకరించారు. దీంతో అతని కుటుంబం, మిత్రులు ఆస్పత్రి బయట నిరసన చేశారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. అప్పటి వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని ఆస్పత్రి బయటే నిరసన చేశారు. ఈ ఘటన గురించి తెలిసి జిల్లాలోని దుర్గామాత ఊరేగింపు చేసేవారందరూ నిందితు లను కఠినంగా శిక్షించేంత వరకు విగ్రహాలు నిమజ్జనం చేసేది లేదని నిరసనకు దిగారు.

# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలామ్

## అక్టోబర్ 15.. మిస్సైల్ మ్యాన్ జయంతి

### ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దిన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దిన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువు కున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట.

ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎన్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (%ణ=ణూ%)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా (%Xూ=ూ%) పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (SLV-III)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళీ తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు.

18 జూలై 1980 లో ఎస్ఎల్వి-3 రోహిణి విజయ వంతంగా ప్రవేశ పెట్టింది..అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ల అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-%XX% అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగ



స్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోక్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది.

గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కవ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

# పునర్వినియోగ రాకెట్ టెక్నాలజీ- స్పేస్ ఎక్స్ అరుదైన ఘనత

న్యూఢిల్లీ, (ప్రజామంటలు):

ఎలన్ మస్క్ కంపెనీ స్పేస్ ఎక్స్ అరుదైన ఘనతను సాధించింది. నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్ బూస్టర్ తిరిగి లాంచ్‌ప్యాడ్ దగ్గరకే చేర్చి చరిత్ర సృష్టించింది. దీంతో రాకెట్ ప్రయోగ టెక్నాలజీలో గణనీయమైన విజయాన్ని నమోదు చేసుకుంది. అమెరికాలోని టెక్సాస్ నుండి నిర్వహించిన ఈ చారిత్రాత్మక టెస్ట్ ఫ్లైట్, పునర్వినియోగ రాకెట్ సాంకేతికతను అభివృద్ధి చేయడానికి, అంతరిక్ష పరిశోధనల్లో తన సత్తాను చాటుకుంది స్పేస్ ఎక్స్. అపోలో ప్రోగ్రాం సాటర్న్ కంటే రెట్టింపు శక్తి కలిగిన బూస్టర్ రాకెట్ తెల్లవారుజామున ఆకాశంలోకి నీలిరంగు జ్వాలలకు చిమ్ముతూ నేలపైకి దూసుకువచ్చింది. వ్యోమనౌకలో రోదసీలోకి వెళ్లిన అమెరికాకు చెందిన బూస్టర్ సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్ బూస్టర్ తిరిగి లాంచ్‌ప్యాడ్ దగ్గరకే చేర్చిన ఘనతను సాదించింది. ఆకాశం నుంచి వచ్చిన రాకెట్ బూస్టర్‌ను.. లాంచ్‌ప్యాడ్ దగ్గర ల్యాండ్ చేశారు సైంటిస్టులు. మనుషులను అంతరిక్షంలోకి పంపే ప్రక్రియలో ప్రయోగాలు నిర్వహిస్తున్న స్పేస్ ఎక్స్.. మరి సరికొత్త ప్రయోగంతో చరిత్ర సృష్టించింది. ఈ ప్రయోగం ద్వారా రాకెట్ నుంచి విడిపోయిన 71 మీటర్ల బూస్టర్, 30 నిమిషాల తర్వాత ప్రయోగించిన చోటుకే వచ్చి సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. ఇలాంటి ప్రయోగం సక్సెస్ కావడం ఇదే తొలిసారి రాకెట్ బూస్టర్లను తిరిగి రప్పించడం స్పేస్ ఎక్స్‌కు కొత్తేమీ కాదు. ఉపగ్రహాలు, వ్యోమగాములను కక్ష్యలో ప్రవేశపట్టిన తర్వాత భూమికి తిరిగొచ్చే ఫాల్కన్-9 రాకెట్లకు ఉండే బూస్టర్లను తొమ్మిదేళ్లుగా రికవరీ చేస్తూనే ఉంది. అయితే మహాసముద్రాల్లో ఏర్పాటు చేసిన తేలియాడే ప్లాట్ ఫామ్‌లమీద లేదా కాంక్రీట్ శ్లాబులపై ల్యాండ్ అయ్యేవి. కానీ ఇలా భూమి మీద ఏర్పాటు చేసిన స్ట్రక్చర్‌లో ల్యాండ్ కావడం మాత్రం ఇదే తొలిసారి.



# గద్దర సినిమా అవార్డులపై ప్రభుత్వం కసరత్తు

### కమిటీ సభ్యులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్, (ప్రజామంటలు):

గద్దర్ సినిమా అవార్డుల ఎంపికపై విధివిధానాలు ఖరారు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అవార్డుల కమిటీ చైర్మన్ బి. నర్సింగ్ రావు, వైస్ చైర్మన్ దిల్ రాజు, సలహా మండలి సభ్యులు తమ్మారెడ్డి భరద్వాజ, గుమ్మడి వెన్నెల, తనికెళ్ళ భరణి, డి. సురేష్ బాబు, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సానా యాది రెడ్డి, హరీష్ శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి హనుమంత రావు, ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు లు పాల్గొన్నారు.

### ఇండియన్ కోస్ట్‌గార్డ్ కొత్త చీఫ్‌గా ఎస్ పరమేష్

### కేంద్ర ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ, (ప్రజామంటలు):

భారత తీర రక్షక దళం ఇండియన్ కోస్ట్ గార్డ్ కొత్త చీఫ్‌గా ఎస్ పరమేష్‌ను నియమిస్తున్నట్లు భారత ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈయన అక్టోబరు 15న అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. గత నెలలో పూర్వపు చీఫ్ డిజి రాకేష్ పాల్ గుండెపోటుతో మరణించగా.. పరమేష్ ప్రస్తుతం డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త చీఫ్ పరమేష్ న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీ విద్యార్థి. ఈయనకు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. భూమిపై, సముద్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. అధునాతన ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్ సమర్, ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్ విశ్వాస్ట్ వంటి ప్రధాన నౌకలకు నాయకత్వం వహించారు. ఈయన కోస్ట్ గార్డ్ రీజియన్స్ ఈస్ట్, వెస్ట్‌లకూ నాయకత్వం వహించారు. 2018 జులై నుండి 2023 ఆగస్టు వరకు తూర్పు సముద్ర తీరానికి కోస్ట్ గార్డ్ కమాండర్‌గా పనిచేశారు.

## అమరావతిలో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' ట్వీట్ చేసిన సిఎం చంద్రబాబు

అమరావతి, (ప్రజామంటలు):

భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయనతో ఉన్న అనుబంధాన్ని, భారత పారిశ్రామిక రంగానికి ఆయన చేసిన సేవల్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో ఏపీ రాజధాని అమరావతిలో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' స్థాపించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ట్వీట్ చేశారు. ఈ హబ్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్, మెంటర్ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తుందని చంద్రబాబు అన్నారు. ఈ హబ్ ఐదు ఇతర జోనల్ కేంద్రాలకు అనుసంధానించబడుతుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రంగాలలో సాంకేతికత, నైపుణ్యాల మెరుగుదలని ఈ హబ్ సులభతరం చేస్తుందని చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు. 86 ఏళ్ల రతన్ టాటా అక్టోబర్ 9న నగరంలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో కన్నుమూశారు. ఈయన మరణాంతరం టాటా ట్రస్ట్ కొత్త ఛైర్మన్‌గా నోయెల్ టాటాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రాజకీయ సంస్కరణలతోనే సురాజ్యం సాధ్యం

కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తం చేసామని ప్రధాని మోడీ గత దశాబ్ద కాలంగా పదేపదే ప్రకటి స్తున్నారు. దేశం ఆర్థిక అభివృద్ధిలో దూసుకుని పోతోందని అంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. వీటిని పట్టించుకోవడం లేదు. అంతెందుకు అంత్యోదయ అన్నయోజన కింద సరఫరా చేసే ఉచిత బియ్యం పథకాన్ని వచ్చే డిసెంబర్ వరకు పొడిగించారు. అంటే పేదరికం ఉన్నట్లా లేనట్లా అన్నది గమనించాలి. ధరలు దాడులు చేస్తుంటే.. మధ్యతరగతి వారు కూడా పేదలుగా మారుతున్నారు. ఉప్పులు పప్పులు, బియ్యం ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు వీటి గురించి పట్టించుకోవడం లేదు. ధరలను అదుపు చేసే ప్రయత్నాలు చేయడం లేదు. ధాన్యం రాశులు కుప్పలుతెప్పలుగా మూలుగుతున్నా బియ్యం ధరలు అదుపు కావడం లేదు. కూరగయాల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. పప్పులు, ఉల్లిగడ్డలు, నూనెల ధరలు కూడా అడ్డూ అదుపులేకుండా పెరుగుతున్నాయి. ధరలను అదుపు చేసే విషయంలో కేంద్రం కనీసంగా అయినా రాష్ట్రాలతో మాట్లాడడం లేదు. ఎంతసేపు రాజకీయాలు, ఎన్నికల గొడవ తప్ప ప్రజల అవస్థలు పట్టడం లేదు. రాజకీయ అవినీతి కారణంగా ప్రజల సమస్యలు పక్కకు పోతున్నాయి. అలాగే రాజకీయ నాయకుల అవినీతిపై తక్షణం విచారణ జరిగేలా చట్టాల్లో మార్పులు రావాలి. సామాన్యులకు ఎలా అయితే చట్టబద్ద విచారణ సాగి, శిక్షలు పడుతున్నాయో రాజకీయాల ను, పాలనను అడ్డం పెట్టుకుని కోట్లు గడిస్తున్న నాయకులకు కూడా అలాగే విచారణ జరగాలి. అందుకు తగ్గ కఠిన శిక్షలు పడాలి. ఇలాంటి సంస్కరణలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. అక్రమంగా వేలకోట్లు సంపాదిస్తున్న వారంతా మహా నేతాలుగా చలామణి అవుతున్నారు. ఇకపోతే రాష్ట్రాల్లో అధికారంలో ఉండగా అవినీతికి పాల్పడిన నేతలను విచారించి కఠినచర్యలు తీసుకునే అధికారం కేంద్రప్రభుత్వానికి ఉండాలి. కేంద్రంలో అవినీతి జరిగితే కూడా నేతలను తక్షణం విచారించే రాజ్యాంగ వ్యవస్థ రావాలి. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ.. రాజ్యాంగాన్ని సవరించుకుంటున్న మనం ఈ విషయంలో కూడా సవరణలకు పూనుకోవాలి. ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడం వల్ల ఆయా నేతల కారణంగా ఎక్కువ శాతం అవినీతికి ఆస్కారం ఏర్పడింది. అలాంటి వారి పనిపట్టే చట్టబద్ద వ్యవస్థ ఉండాలి. రాజకీయ పార్టీల నేతల అవినీతిపై సత్వర విచారణకు సుప్రీం సూచించినా అడుగు ముందుకు పడడం లేదు. ఈ క్రమంలో రాజకీయ వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం లేదు. పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా పంటల ఉత్పత్తి పెంచాలి. జనాభా నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేయాలి. పాలకుల్లో మార్పులు రావడం లేదు కనుక ప్రజల్లో చైతన్యం రావాలి. ఒకే పార్టీలో ఉంటున్న కొందరు గుత్తాధిపత్యం చెలాయి స్తున్నారు. పాలనలో ఒక్కరే నిరంతరంగా ఉండే విధానం పోవాలి. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఇలా చేయడం వల్ల కొందరే అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. ఐదేళ్ల కాలానికి ఎన్నికైతే మరో ఐదేళ్ల అధికారం కోసం మాత్రమే ఓటుబ్యాంక్ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయాల్లో రొటేషన్ పద్దతి రావాలి. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా గెలవకుండా రెండు టర్మ్‌ల కాలాన్ని పరిగణించాలి. దానిని కూడా నాలుగేళ్లకే కుదించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు రావాల్సి ఉంది. అప్పుడే యువతకు అవకాశం వస్తుంది. యువత రాజీకాయల్లోకి వస్తేనే మార్పులు కూడా వస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే 77 ఏళ్ల స్వాతంత్యోత్సవంలో ఇంకా పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు కూడా పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. ఇదంతా కూడా పాలకుల నిర్లక్ష్యంగానే చూడాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. రాజకీయ నేతలను నిలదీయాలి.

గ్రామస్థాయిలో నిలదీతలను ప్రజలు అలవర్చుకోవాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని దేశాన్ని సక్రంగా ముందుకు తీసుకుని వెళుతున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఏదో ఓటేశామన్న నిర్లిప్త ధోరణి కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. వారి కుటుంబాలను యావత్తూ రాజకీయాల్లోకి దింపి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవర్చుకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా సర్పంచ్ నుంచి ఎంపి వరకు ఎన్నికయ్యే పద్దతికి స్వస్తి పలకాలి. చట్టసభల్లో అమెరికా లాగా కేవలం రెండు పర్యాయాలు మాత్రమే పోటీచేసే అవకాశం మాత్రమే ఉండాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్‌లకు మించి పనిచేయకుండా చట్టబద్ద విధానం అమల్లోకి తీసుకుని రావాలి. అలాగే ఒక్కచోట నుంచి పోటీ చేసేలా కూడా మార్పులు రావాలి. జీవితాంతం ఒక్కరే ఎంపిగా లేదా ఎమ్మెల్యేగా ఉండే విధానం పోవాలి. దీనికి తక్షణ రాజ్యాంగ సవరణ అవసరం. దీనిపై ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప వారు ప్రజల సమస్యలను చర్చించారు. కొందరు నాయకులు మాత్రమే నిరంతరంగా అధికారాన్ని అడ్డం పెట్టుకునే ఆగత్యం ఉండదు. అలాగే కుటుంబంలో ఒక్కరికి ఒకే పదవి అన్న విధానం కూడా రావాలి. వారసత్వ రాజకీయాలను అడ్డుకోవడానికి ఇది దోహద పడగలదు. దేశంలోని యువత, మేధావులు దీనిపై చర్చచేయాలి. రాజకీయ అవినీతిని నిరోధించేలా రాజ్యాంగ సంస్కరణలకు శ్రీకారం చుడితేనే మన ప్రజాస్టామ్యానికి అర్థం ఉంటుంది. మన ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఇలాంటి విషయాల్లో ఎంతమేరకు సత్ఫలితాలు సాధించామో ప్రజలు,మేధావులు చర్చించావాల్సిన అవసరం ఇప్పుడు ఏర్పడింది. అలాగే కొందరే ఎల్లకాలం పాలకులుగా ఉండడంతో భారత పాలనా తీరులో మార్పు రావడంలేదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పరిఢవిల్లుతున్నా అది కేవలం పాలకులకు మాత్రమే ఉపయోగపడుతోంది. ఈ రకమైన సంస్కరణలకు జనం ఉద్యమించాలి. అప్పుడే పార్లమెంటులో చట్టం రాగలదు.

# ప్రజావాణి ఆర్జీలను వేగంగా పరిష్కరించాలి

## - అదనపు కలెక్టర్ పి. రాంబాబు

జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఆర్జీలను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గౌతమ్ రెడ్డితో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు, పులి మధు సుధన్ గౌడ్ , శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్

## నిధులు విడుదల అయ్యేవరకు కళాశాలలు తెరువబోము

జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
రాష్ట్ర ప్రభుత్వం గత 3 సంవత్సరాలుగా కళాశాల లకు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయక పోవడం తో పూర్తిగా ఈ నిధులతో నడిచే రాష్ట్రం లోని డిగ్రీ కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాయని , జీతాల చెల్లింపు, భవనాల అద్దెలు, వడ్డీల చెల్లింపు, నిర్వహణ కూడా కష్టంగా వుందని అందుకే తప్పని సరి పరిస్థితులలో కళాశాలలను మూసివేస్తున్నామని కళాశాల నిర్వాహకులు తెలిపారు. తమకు రియంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని అధికారులు, మంత్రులు అందరినీ కలిసి ఎన్ని సార్లు అడిగినా కనీస స్పందన లేదని ముఖ్యమంత్రిని కలుద్దాం అని ఎన్ని సార్లు ప్రయత్నించినా సమయం ఇవ్వకపోవడం తో అన్ని ప్రయత్నాలు చేసిన తరువాత చివరగా కళాశాలల నిరవధిక బందుకు డిగ్రీ కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ పిలుపు ను ఇచ్చిందని తెలిపారు. అసోసియేషన్ పిలుపు మేరకు జగిత్యాల జిల్లాలో అన్ని డిగ్రీ కళాశాలలు బందు లో పాల్గొంటున్నాయి. ప్రభుత్వం నుండి నిధులు విడుదల అయ్యే వరకు కళాశాలలు తెరవబోమని డిగ్రీ కళాశాలల జగిత్యాల జిల్లా అధ్యక్షులు పోతని ప్రవీణ్ మరియు జిల్లా డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు తెలిపారు.






## వేములవాడ రాజన్నకు మొక్కులు చెల్లించుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

వేములవాడ అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
దక్షిణ కాశీగా పేరు పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకొని, కోడేతో ఆలయ ప్రదక్షిణ చేసి, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి- లక్ష్మణ్ కుటుంబం మొక్కు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వద మండపములో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేశారు.

# జగిత్యాల నుండి శబరిమలైకి మహాపాదయాత్ర

జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
జగిత్యాల అయ్యప్ప ఆలయం నుండి 14 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి తో సోమవారం మధ్యాహ్నం మహాపాదయాత్రగా శబరిమలైకి ప్రయాణమయ్యారు. 16వ తేదీ కరీంనగర్ కు చేరుకొని తిరిగి అక్కడ నుండి మహా పాదయాత్ర కొనసాగిస్తామని స్వాములు తెలిపారు. రోజుకు 32 కిలోమీటర్ల చొప్పున పాదయాత్ర కొనసాగునని తెలిపారు.



తాము గత 12 సంవత్సరాలుగా మహా పాదయాత్ర కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. నవంబర్ 29న శబరిమలై ఆలయంలో స్వామి దర్శనం చేసుకొని 30వ తేదీన స్వామివారికి నెయ్యి అభిషేకం చేసుకొని తిరుగు ప్రయాణం కానున్నట్లు తెలిపారు. ప్రతిరోజు బ్రాహ్మి ముహూర్తమున నాలుగు గంటల నుండి పాదయాత్ర కొనసాగిస్తామని తెలిపారు. లోక కళ్యాణార్థం మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామని స్వాములు పేర్కొన్నారు.

## మల్యాల పోచమ్మ తల్లికి వెండి కళ్ళు సమర్పించిన భోగి వంశీ



ఇల్లందకుంట మండల్ అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
మల్యాల గ్రామంలోని శ్రీ పోచమ్మ తల్లి కి మర్రిపల్లిగూడేం వాస్తవ్యులు భోగి వంశీ జమ్మికుంటలోని బ్రాండ్ కళ్యాణ్ జ్యూవెలరీ వారు. పోచమ్మ తల్లి కి వెండి కండ్లు సమర్పించారు. మల్యాల గ్రామంలోని నాయకులు కుల పేద్ధలు ప్రజలు (భోగి వంశీ).. గారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వారి స్నేహితుడు దేవునూరి వేంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.

# జగిత్యాల రెంజర్ సస్పెండ్



జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
అటవీశాఖ డిప్యూటీ రెంజ్ అధికారి అరుణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ సాయిరాంను అటవీశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 11న జగిత్యాల జిల్లా అటవీశాఖ కార్యాలయ అవరణలో అధికారులు, సిబ్బంది దావత్ ఏర్పాటు చేసుకుని మద్యం సేవించగా, ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణించిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఇద్దరిపై వేటు వేశారు. మరికొంత మందిపైన కూడా వేటుపడే అవకాశం ఉన్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి తెలిపారు.


# పెదరాంచర్లలో కన్నడ శాసనం

## చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి

జనగామ అక్టోబర్ 14 (ప్రజామంటలు):
జనగామ మండలం, పెదరాంచర్ల గ్రామంలో చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి వెలుగులోకి రాని ఒక శాసనమును గుర్తించారు. గ్రామంలోని రాముల వారి గుట్టకు వెనుక వైపు వెంకన్న బండపై వినాయకుని బొమ్మకు ఎడమ వైపున ఒక బండరాయిపై శాసనం చెక్కబడి ఉంది. డా.మునిరత్నం (డైరెక్టర్ (ఎపిగ్రఫీ), ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ) సహాయంతో పరిశోధకుడు ఈ శాసన వివరాలను తెలిపారు. ఇది 9వ శతాబ్దపు నాటి కన్నడ భాష లో వ్రాయబడింది. శాసనము రెండు వరుసల్లో ఉంది

1. శ్రీ సాంబేయ సంసారం
2. భీతం మడిసిడమ్

గణేశుడి శిల్పంను సాంబయ్య అనే వ్యక్తి చెక్కించారని అందులో పేర్కొన్నారు. "డిస్కవరీ మ్యాన్ గా "ప్రసిద్ధి చెందిన పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి జనగామ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 50 కి పైగా శాసనాలను వెలుగులోకి తెచ్చారు. పురావస్తు శాఖ వీటిని అన్నింటిని పరిష్కరిస్తే జనగామ చరిత్ర సంపూర్ణంగా వెల్లడవుతుందని పరిశోధకుడు భావిస్తున్నారు.



# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి వైద్య బృందంచే ఉచిత వైద్య శిబిరం



జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు తాటిపాముల వినోద్ కుమార్ మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్న స్ఫూర్తితో లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ డాక్టర్ మోర సుమన్, డాక్టర్ తాటిపాముల సురేష్ కుమార్, డాక్టర్ అంకం లక్ష్మణ్, మరియు డాక్టర్ రాచకొండ శ్రీనివాస్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత నేత్ర వైద్య చికిత్సా శిబిరంలో రేకుర్తి కంటి ఆసుపత్రి హాస్పిటల్ నుంచి వచ్చిన డాక్టర్ల బృందం సుమారు 160 మందికి పరీక్షలు నిర్వహించగా దానిలో ఆపరేషన్ అవసరమున్న 84 మందిని ఎంపిక చేసి తొలి విడతగా ఈరోజు 40 మందిని ఆపరేషన్ల కొరకై రేకుర్తి కంటి ఆసుపత్రి కి తీసుకెళ్ళగా,. మిగతా వారిని రెండో విడతగా రేకుర్తి హాస్పిటల్ కి ఉచిత రవాణా సౌకర్యంతో పంపడం జరుగుతుందని తెలుపుతూ లయన్స్ క్లబ్ నిర్వహించు కార్యక్రమాలు ఉచిత డయాబెటిస్ క్యాంప్ సెంటర్లు, మోతెబిందు (కంటి శు క్లాలు), కంటి చూపుకు సంబంధించిన వ్యాధులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు,ప్రకృతి వైపరీత్యంలో సేవా కార్యక్రమాలు, కళ్ళు లేని వారికి దాతల ద్వారా సేకరించబడిన నేత్రదానం, యువతకు టాలెంట్, కాంపిటీషన్ ప్రోగ్రామ్స్ మరియు అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని వీటిని జగిత్యాల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లైన్ గుంటుక చంద్ర ప్రకాష్ (ఇన్నర్ క్యాబినెట్ పిఎస్టి ఫోరం) హాజరు కాగ , చార్టర్ ప్రెసిడెంట్ శ్రీరాముల సుదర్శన్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ల శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్, జి ఎస్ టి కోఆర్డినేటర్ ఐల్నేని వెంకటేశ్వరరావు మరియు వైస్ ప్రెసిడెంట్ మానపురి శ్రీనివాస్, అనుమల్ల విలాస్, సభ్యులు కట్ల శ్రీనివాస్ సామల శ్రీహరి, దోపతి దేవదాస్, ముల్క గంగాధర్, లక్ష్మీనారాయణ గౌడ్, వడ్లగడ్డ గోపి మర్రిపల్లి శ్రీనివాస్ మేనేని ప్రభాకర్ రావు ఎస్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి ఎంపీ కి వినతి పత్రం అందచేసిన బ్రిడ్జి సాధన సమితి సభ్యులు

జనగామ అక్టోబర్ 14 (ప్రజామంటలు):
జనగామ జిల్లా చిటకోడూరు వాగు మీద ఉన్న కల్వర్టు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఒక్క పక్క కూలిపోయి, వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నామని పది గ్రామాల ప్రజల కు ఇదే ఏకైక దారి అని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని చిటకోడూరు బ్రిడ్జి సాధన సమితి కన్వీనర్ యాసారపు కరుణాకర్ అన్నారు. చిటకోడూరు బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూడల సిద్దయ్య గౌడ్, మెరుగు బాలరాజు గౌడ్,సలేంద్రి శ్రీనివాస్,చిక్కుడు వెంకటేష్, చామకూర చిరంజీవి,వై కృష్ణం రాజు,వై పరశు రామ్,కర్ల శ్రీకాంత్ రెడ్డి,రాజు యాదవ్,చెరుకూరి కుమార్ పాల్గొన్నారు.

# ధ్వజ స్థంభం నిర్మాణం కొరకు ఆర్థిక సహాయం

గొల్లపల్లి అక్టోబర్ 14 (ప్రజామంటలు):
శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి దేవాలయం లో ఉన్నటువంటి ధ్వజస్తంభం శిథిలావస్థకు గురికావడం వల్ల అట్టి ధ్వజ స్తంభం నిర్మాణం కొరకు నవ దుర్గా సేవా సమితి యూత్ సభ్యులు, యాభై వెయ్యిల పదహారు రూపాయలు ఆలయ ధర్మకర్త అనంతుల భూమయ్యకు, ఆలయ పురోహితులు తిరునాహరి సత్యనారాయణ చేతుల మీదుగా నవ దుర్గ సేవాసమితి సభ్యులు విరాళంగా అందజేశారు ఈ కార్యక్రమంలో నవదుర్గ సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఈనెల 15,16 తేదీలను లోకల్ హాలిడే గా ప్రకటించాలి

జనగామ అక్టోబర్ 14 (ప్రజామంటలు):
ఈనెల 16,17 తేదీల్లో జరిగే శ్రీ విజయ దుర్గ మాత పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యాసంస్థలు స్కూల్స్ కళాశాలలకు సెలవు ప్రకటించాలని విద్యార్థి జేఏసీ చైర్మన్ పిట్టల సురేష్ కలెక్టర్ వినతిపత్రం అందజేశారు.



ఈనెల 15,16 తేదీలను లోకల్ హాలిడే గా ప్రకటించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. వారు వెంటనే స్పందించి సానుకూలంగా స్పందించారని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు అభి గౌడ్, టిజివిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్,దండు ఉపేందర్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ అక్బర్ సాబ్..

**●గ్రామ కార్యదర్శి అక్బర్ సేవలు రాష్ట్రానికే ఆదర్శం ● అభినందనలతో "ప్రశంసా పత్రం" అందజేసిన విడిసి**




బుగ్గారం / జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్బర్ ను "శభాష్ అక్బర్ సాబ్" అంటూ గ్రామ ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటి కొనియాడారు. గ్రామ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఆయనకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం అభినందనలతో కూడిన "ప్రశంసా పత్రం" అందజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా విడిసి కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ గత కొంత కాలంగా పంచాయతీ కార్యదర్శి అక్బర్ గ్రామానికి, ప్రజలకు అందజేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామ పంచాయతీలో తగిన బడ్జెట్ లేకున్నా - ప్రజల సహకారంతో "బతుకమ్మ - దసరా" పండుగల ఉత్సవాలకు ఆయన చేసిన గొప్ప ఏర్పాట్లను, సౌకర్యాలను, ఆయన అందించిన సేవలను, స్వయంగా అక్బర్ అత్యంత భక్తిశ్రద్ధలతో పూజల్లో, ఉత్సవాలలో కూడా పాల్గొన్న విధానాన్ని, సమయ స్ఫూర్తితో వ్యవహరించిన తీరును వివరించారు.

కుల - మతాలకతీతంగా పంచాయతీ కార్యదర్శి అక్బర్ చేసిన సేవలను గ్రామ ప్రజలంతా గుర్తించి ముక్త కంఠంతో కొనియాడుతున్నారని చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి "అక్బర్ సేవలు" రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని, ప్రపంచ ఖ్యాతి పొందాలని వారంతా ఆశించారు. ఇలాంటి ప్రజా సేవకులు ఉంటే గ్రామాలు అత్యున్నత స్థాయిలో అభివృద్ధిని సాధిస్తాయని అన్నారు. ఇలాంటి ప్రశంసలు, పురస్కారాలు, అవార్డులు, రివార్డులు, పదోన్నతులు ఇంకా ఎన్నెన్నో అక్బర్ సాబ్ పొందాలని వారంతా మనసారా కోరుకుంటున్నామని తెలిపారు.

గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, వైస్ చైర్మన్ పెద్దనవేని రాగన్న, విడిసి ఉపాధ్యక్షులు సుంకం ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి పెద్దనవేని రాజేందర్, సాంస్కృతిక కార్యదర్శి డా: నక్క రాజు, సహాయ కార్యదర్శి కళ్లెం నగేష్, కాశెట్టి మహేష్, మాజీ సర్పంచ్ మసర్తి రాజిరెడ్డి, దసర్తి పోచన్న, గంజి జగన్, అక్కల రాజేష్, నక్క సాయి, జంగ రవి, జంగ రమేష్, జంగ మల్లేశం, వడ్ల రమేష్, కేతి మల్లయ్య, ఇస్త్రీ పోచన్న తదితరులు పాల్గొన్నారు.



# దుర్గమ్మ తల్లికి సారెను సమర్పణచిన పూసల సంఘం

జనగామ అక్టోబర్ 14 (ప్రజామంటలు): జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 15, 16, 17 తేదీలలో జరిగే దుర్గాభవాని ఉత్సవాల సందర్భంగా, ఎల్లమ్మ తల్లికి దుర్గమ్మ తల్లికి సారెను జిల్లా పూసల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సమర్పించారు. శుభకార్యం జరిగేటప్పుడు గానీ మంగళకరమైన వస్తువులు అంటే పసుపు, కుంకుమ, గంధం, గాజులు, నల్లపూసలు, ముత్యాలు పవుడాలు, బొట్టు, కాటుక, పూలు చీరలు, తొలి కానుకగా పూసల సమాజం తరఫున అందించడమైనది. అనాదిగా గ్రామీణ వ్యవస్థలో సౌందర్య సాధనాలు సౌభాగ్యమైన వస్తువులన్నీ కూడా సమాజానికి చేరువ చేసేవారు పూసలవారు ఆనాటి నుంచి ఈనాటి వరకు దేవతల కార్యక్రమాల్లో గాని మనుషుల శుభకార్యాల్లో గాని వీరి వస్తువులే ప్రధానంగా ముందుంటాయి అందుకే అమ్మవారలకి తొలి కానుకగా సారే చీరను ఘనంగా సమర్పించారు. స్థానిక పూసల కాలనీ పూసలభవనం నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి గుడికి చేరి పూజలు చేసి సమర్పించారు. రేపు ఎల్లమ్మ తల్లి కళ్యాణ సందర్భంగా అమ్మవారికి కల్యాణ వస్తువులైన అన్నీ కూడా సమర్పించారు. దేవాలయ కమిటీ వారు సమాజంలో ప్రధాన వృత్తి నైపుణ్యాలు కలవారి యొక్క అందరికీ గుర్తింపునిస్తూ అమ్మవారి యొక్క పండుగను దిగ్విజయంగా జరుపుకొనుటకు అందర్నీ కలుపుకొని కార్యక్రమం చేస్తున్నామని కమిటీ చెబుతున్నారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీతోపాటు, కౌన్సిలర్ వాంకుడోతు అనిత , పూసల సమాజం తరఫున పన్నీరు సత్యం రాష్ట్ర నాయకులు, చిన్నిపల్లి శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడు, నాగిశెట్టి శ్రీనివాస్ అడిషనల్ జిల్లా జనరల్ సెక్రెటరీ, తుపాకుల బాల నారాయణ జిల్లా సంచారజాతుల సంఘం అధ్యక్షుడు, పూసల హౌసింగ్ మ్యాక్స్ కోశాధికారి పగిడిపల్లి చంద్రమౌళి, పగిడిపల్లి శ్రీనివాస్, పన్నీరు రవీందర్ రిటైర్డ్ ఎస్ ఐ, పన్నీరు నాగేష్, పన్నీరు శ్రీనివాస్, బోశెట్టి కుమార్, పగిడిపల్లి రామస్వామి, పన్నీర్ రాజు, కావేటి రాజు తో పాటు మహిళలందరూ పాల్గొన్నారు.



## వైద్యులను పరామర్శించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) : కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్ రవికిరణ్ ల తండ్రి ఇటీవల మరణించగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరుట్ల పట్టణంలో ఈరోజు మృతుడి గృహానికి వెళ్లి వైద్యులను .పరామర్శించారు. జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



లక్ష్మీ నగర్ కాలనీ జి'హెచ్'ఎం'సి పార్కులో ఏ' బీ'సీ లాఫింగ్ క్లబ్ 'అత్తాపూర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎకానమిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య 70వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు.

# వీధి కుక్కలు- కోతుల దాడి నుండి ప్రజల్ని రక్షించాలని కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా



జనగామ అక్టోబర్ 14 (ప్రజామంటలు) : జనగామ జిల్లా కేంద్రంలోని జనగామ పట్టణంలో గుంపులు గుంపులుగా సంచరిస్తు పసి పిల్లలపైన మహిళల పైన వృద్ధుల పైన దాడి చేసి కరుస్తున్న కోతులను కుక్కలను నివారించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి - జోగు ప్రకాష్ జనగాం పట్టణ కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కోతులు కుక్కలు నివారించి ప్రజల ప్రాణాలకు రక్షణ కనిపించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మెమోరాండం ఇచ్చిన అనంతరం పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ అధికారులు పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఇన్నల్లోకి చొరబడి తిను బండారాలను బియ్యం వస్తువులను ఎత్తుకపోతున్నాయని అన్నారు. అడ్డగించిన వారిపై దాడి చేస్తున్నాయని అలాగే వీధులలో వ్యాపారం చేసుకునే కూరగాయలు పండ్లబండ్లపై కూడా దాడికి ఎగబడి భయభ్రాంతులను చేస్తున్నాయి అన్నారు.వీటి బారి నుండి తప్పించుకోబోయి అనేకమంది ప్రజలు పడి గాయాలపాలు కాళ్లు చేతులు విరిగాయని తలలకు గాయాలలు అయినాయి వీధి కుక్కల దాడుల వల్ల కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు అవి కలిసి ప్రాణాల మీదికే అపాయం ఏర్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని వాహనాలపై పోతున్న ప్రజల పైన వెంబడిస్తున్న సందర్భాలు అనేకం జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు అధికారులకు అనేకసార్లు విన్నవించిన పట్టించుకోవటం లేదని వివరించారు. తక్షణం జిల్లా కలెక్టర్ కోతుల కుక్కల నివారణ కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చుంచు విజయేందర్ ఎండి అజారుద్దీన్ పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం పల్లెర్ల లలిత బోట్ల శ్రావణ్ పాము శ్రీకాంత్ పందిళ్ళ కళ్యాణి సిపిఎం నాయకులు చిదురల ఉపేందర్ బూడిది ప్రశాంత్ ఎండి మునీర్ దేవదానం జి లక్ష్మీనరసింహారెడ్డి పాల్వాయి పద్మ ఎర్ర రజిత పి కనకచారి కళ్లెపు కుమార్ పద్మ భవాని,సి. హెచ్. రజిత సుధాకర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# జల సమస్యలను పరిష్కరిస్తాం

జనగామ అక్టోబర్, 14 (ప్రజామంటలు) ప్రజల అందించిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తెలిపా రు. గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్ లో ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 17దరఖాస్తులను స్వీకరించారు. జనగామ మున్సిపల్ పరిధిలోని సాయి నగర్ కు చెందిన అల్ల అనిత తాను ఒంటరిగా జీవిస్తున్నానని, అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని దరఖాస్తు అందించారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ కి చెందిన నర్సోజి తన దరఖాస్తు అందిస్తూ, నిరుపేద కుటుంబానికి చెందిన వాడినని తనకు తెల్ల కార్డు మంజూరు చేయాలని, పెన్షన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు గిర్నిగడ్డకు చెందిన నిరుపేదలు ఆర్. కోటేశ్వర్, ఆర్. భాస్కర్ లు తాము రేకుల ఇంటిలో నివసిస్తున్నామని, ఇంటిపైన చింత చెట్టు కొమ్మలు ఉండటంతో కోతులు ఇబ్బందికి గురి చేస్తున్నాయని, తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా దరఖాస్తు అందించారు. పట్టణంలోని మున్సిపల్ రోడ్డులో నివసిస్తున్న దివ్యాంగుడు పత్తిపాక దినేష్ తనకు 45 శాతం వికలాంగత్వంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని జీవనోపాధికి పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు ఇచ్చారు.అలాగే సాయి నగర్ కి చెందిన ఒంటరి మహిళ బండి లక్ష్మి తాను దరఖాస్తు అందిస్తూ తనకు భర్త లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నానని పెన్షన్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని చర్యలు తీసుకోవాలంటూ పలువురు దరఖాస్తులు అందించారు. ప్రజల నుండి వచ్చిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు జారీ చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ డే లో జడ్పీ సీఈవో సరిత, డి ఆర్ డి ఓ వసంత, జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు కొమరయ్య, వెంకన్న, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ మెడికల్ కాలేజీకి సాయిబాబా పార్థివ దేహం

**సీపీఐ నారాయణ, పీఓడబ్ల్యూ సంధ్య, లక్ష్మన్ హాజరు**



సికింద్రాబాద్, అక్టోబర్ 14 (ప్రజామంటలు) : ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహాన్ని, గాంధీ మెడికల్ కాలేజీకి డోనెట్ చేశారు. మెడికల్ స్టూడెంట్స్ వైద్య పరిశోధనల కోసం సాయిబాబా పార్థివ దేహాన్ని భార్య వసంతకుమారి, కూతురు మంజీరా, సోదరుడు రాందేవ్ లు అనాటమీ డిపార్ట్ మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవిశేఖర్ రావులకు అందచేశారు. ఈసందర్భంగా గాంధీ లో సాయిబాబా పార్థివదేహాన్ని ఆయన అభిమానులు, సన్నిహితులు, ప్రజాసంఘాల నాయకులతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సీపీఐ కార్యదర్శి నారాయణ, పీఓడబ్ల్యూ నేత సంధ్య, పౌరహక్కుల సంఘ అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మన్, ప్రజాసంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాల నేతలు, ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్తులు, తదితరులు పాల్గొని కడసారి సాయిబాబా కు వీడ్కోలు పలికారు. జోహార్... కామ్రేడ్సాయిబాబా..అమర్ రహే..ఉపా చట్టాన్ని రద్దు చేయాలంటూ..నినాదాలు చేశారు.

# మున్సిపాలిటీ లలో చెత్త నిర్వహణ సరిగా ఉండాలి

జనగామ అక్టోబర్ 14 (ప్రజామంటలు) : మున్సిపాలిటీ లలో చెత్త నిర్వహణ సరిగా ఉండాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ విపి గౌతమ్ అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ,డైరెక్టర్ వి పి గౌతమ్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి పట్టణం లోని డంపింగ్ యార్డ్, DRC సెంటర్, రంగప్ప చెరువు, రెండు పడక గదులను సందర్శించి పరిశీలించారు. డంపింగ్ యార్డ్ ని ముందుగా పరిశీలించి, ఆయన మాట్లాడుతూ చెత్త నిర్వహణ సరిగా ఉండాలని, సేకరించిన చెత్త ని ఎప్పటికప్పుడు బయో మైనింగ్ ప్రక్రియ పూర్తి చేసి దానిని తరలించాలన్నారు. డి ఆర్ సి సెంటర్ గురించి మాట్లాడుతూ, పేరుకుపోయిన పొడి చెత్త ను త్వరగా తరలించాలన్నారు.వర్మీ కంపోస్టు షెడ్ లోనే ఎరువు ను తయారు చేయాలన్నారు రంగప్ప చెరువు ని సందర్శించి చెరువు అభివృద్ధి కై చేపట్టాలిసిన పనులకు సంబందించి ప్రతిపాదనలను పంపించాలన్నారు చివరగా చాకలి ఐలమ్మ నగర్, మూడవ విడత ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ కాలనీ లో నిర్మిస్తున్న రెండు పడకల గదులను పరిశీలించి ... నిధులకు కొరత లేదని... ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ జమున, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఫ్లోర్ లీడర్ కళ్యాణి,సంబందించిత ఇంజనీరింగ్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కమిటీ క్షేత్ర స్థాయి సందర్శన..



జగిత్యాల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించడానికి నేషనల్ లెవెల్ మానిటరింగ్ సభ్యులు జగిత్యాల జిల్లాను సందర్శించారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అధ్యక్షతన, ఎన్ ఎల్ ఎం టీం సభ్యులైన సుబ్రమణ్యం రెడ్డి మరియు జయప్రకాశ్, సేవభారతి ఇనిస్టిట్యూట్ వివిధ శాఖలకు సంబందించిన అధికారులతో కలెక్టరేట్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. సభ్యులు ఈనెల 14 నుండి 20 వరకు 4 మండలాలలోని 10 గ్రామాలలో పర్యటించి, లబ్దిదారులతో మాట్లాడి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తారు. ఇట్టి సమావేశములో డి.ఆర్.డి.ఓ , అదనపు డి.ఆర్.డి.ఓ గార్లు, ఎల్ డి ఎం , ఏ డి ఎస్ ఎల్ ఆర్ , డబల్ బెడ్ రూమ్ నివాసాల డి ఈ ,ఈ ఈ పి ఆర్ , ఇతర జిల్లా అధికారులు సమీశములో పాల్గొన్నారు.

# వయోధికులకు చట్టం ఆసరా..

### - సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్..

జగిత్యాల అక్టోబర్ 14(ప్రజా మంటలు) :
సీనియర్ సిటీజన్స్(వయో వృద్ధుల) కోసం చట్టం ఆసరాగా ఉందని,వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు..జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా కౌన్సెలింగ్ కేంద్రంలో వయోధికుల రక్షణ,పోషణ సంక్షేమ చట్టంపై హరి ఆశోక్ కుమార్ వయోధికులకు అవగాహన కల్పించారు. వయో వృద్ధులు తమను నిరాదరిస్తున్న కొడుకులపై పెట్టిన కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ ముఖ్య అతిథిగా,ప్రధాన వక్తగా హాజరయ్యారు..నిరాదరణకు గురైన వయోధికులైన తల్లిదండ్రులు సంబంధించిన రెవెన్యూ డివిజన్ అధికారికి ఫిర్యాదు చేస్తే వారి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.ఆర్డీవో తీర్పును పాటించక పోతే 3 నుంచి 6 నెలల జైలు శిక్ష విధించే వీలుందన్నారు.జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలో ఆర్డీవో లు జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్, కోరుట్ల,మెట్ పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ లు వృద్ధుల కేసుల పరిష్కారం లో రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలిచారని పేర్కొన్నారు.తమ తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అస్సోసియేషన్ రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన అసోసియేషన్ అంటూ వయో వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా



ఉంటుందన్నారు..చట్టం లో 2019లో చేసిన సవరణలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఆమోదించాలని ,అందుకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు.
ఈ అవగాహన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు,కౌన్సెలింగ్ అధికారి పి.సి.హన్మంత్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్ముల ప్రకాశ్ రావు,కోరుట్ల డివిజన్ కౌన్సెలింగ్ అధికారులు పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, ఎన్.లక్ష్మీ నారాయణలు, ఎం.డి.సైఫోద్దిన్, మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి,కార్యదర్శి సౌడాల కమలాకర్,,కతలాపూర్ అధ్యక్షుడు అల్లూరి బాపురెడ్డి,మేడిపల్లి అధ్యక్షుడు ఒద్దినేని గోవర్ధన్ రావు,కార్యదర్శి ఎండి.బురానోద్దీన్,ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు కండ్లే గంగాధర్,సారంగపూర్ అధ్యక్షుడు కాలగిరి గంగ రెడ్డి, మహిళా కౌన్సెలింగ్ అసిస్టెంట్ శ్రావణి,వివిధ మండలాల,గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## విద్యా ప్రమాణాల పెంపుకు సంగని రాజు కృషి అభినందనీయం

సికింద్రాబాద్, అక్టోబర్ 14 (ప్రజామంటలు) :
విద్యా ప్రమాణాల పెంపుకు నిరంతరం కృషి చేస్తున్న కృష్ణవేణి టాలెంట్ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సంగని రాజు అభినందనీయులని భోలక్ పూర్, మల్కాజిగిరి కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు అన్నారు. సోమవారం కృష్ణవేణి టాలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సంగని రాజును మంచాల శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన్ని శాలువాతో సత్కరించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులు విజయ్ కుమార్ కి పుత్ర వియోగం

సికింద్రాబాద్, అక్టోబర్ 14 ( ప్రజా మంటలు) :
బన్సీలాల్ పేట డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు, బలరాం కాంపౌండ్ నివాసి ఎం.విజయ్ కుమార్ కుమారుడు డెనిసన్ (25) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీజేపీ యువమోర్చా నాయకులు మర్రి పురూరవరెడ్డి మద్యాహ్నం విజయ్ కుమార్ నివాసానికి వెళ్ళి, ఆయన్ని, కుటుంబసభ్యులను పరామర్శించారు. విజయ్ కుమార్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపి, ఆర్థిక సాయం అందచేశారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, బి.వికాస్, కే.నరేశ్ ఉన్నారు.

## వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



కోరుట్ల అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామమైన యకీన్ పూర్ లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో తీరొక్క పూలు సేకరించి అందంగా బతుకమ్మను తయారు చేసుకుని పసుపుతో తయారుచేసిన గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సాంప్రదాయ బద్ధమైన దుస్తులతో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ, కోరుట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# హైడ్రా ఆగితే..హైదరాబాద్ మరో వయనాడ్

**కాంగ్రెస్ ప్రభుత్వం మీద బిజెపి, బిఆర్ఎస్ దుష్ప్రచారం**

**సాధ్యమైనంత తొందరగా లోకల్ బాడి ఎన్నికల నిర్వహణ**

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు**

నిజామాబాద్,అక్టోబర్ 14(ప్రజా మంటలు) :
ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఆగిపోతే.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మరో వయనాడ్ అవుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా అంశంలో వెనక్కి తగ్గేది లేదని.. హైడ్రా, మూసీ ప్రక్షాళన నిరంతరంగా కొనసాగుతోందని తేల్చి చెప్పారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన మీద కేటీఆర్, హరీష్ రావు, కిషన్ రెడ్డిలవి చిల్లర మాటలని ఫైర్ అయ్యారు. నిజామాద్ జిల్లాలో పర్యటించిన మహేష్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ళలో యువతకు ఉద్యోగాలు ఇవ్వని బీఆరెస్‌కు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగలిచ్చామని అన్నారు. కాంగ్రెస్
ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేయటానికి బీఆర్ఎస్, బీజేపీ ఒకటయ్యాయని.. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం సహా బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఉక్కుపాదం మోపతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనను వివరిస్తూనే స్థానిక సంస్థలు ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని అన్నారు. నిలిచిపోయిన ఎల్ఆర్ఎస్, మాస్టర్ ప్లాన్ అంశాలపై అందరితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. లోకల్ బాడి ఎన్నికలను సాధ్యమైనంత తొందరగా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం, స్థానిక సంస్థల్లో మెజార్టీ సీట్లు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50 వేల వరకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో 30 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను అయోమయానికి గురిచేస్తు న్నాయన్నారు. పదేళ్లలో బీర్ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత, కాంగ్రెస్ 9 నెలల్లో ఇచ్చిన రుణ మాఫీ ఎంతో రైతులు గుర్తించాలని సూచించారు. సోషల్ మీడియాని సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నారని పీసీసీ చీఫ్ మండిపడ్డారు. పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఇది తాత్కాలిక ఆనందం ఇచ్చినా దీర్ఘకాలికంగా బి అర్ ఎస్ కు నష్టం చేకూరుస్తుందని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. వీలైనంత త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని తెలిపారు. మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వివాదంపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. పరకాలలో కార్యకర్తల అత్యుత్సాహం వల్లే ఇద్దరి మధ్య వివాదం చెలరేగిందన్నారు. మంత్రి , ఎమ్మెల్యే ఇరువురి తో మాట్లాడినట్లు తెలిపారు.ఈ అంశంపై మాట్లాడాలని ఇన్‌ఛార్జి మంత్రికి చెప్పామన్నారు. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి వివాదం పార్టీ అంతర్గత సమస్య త్వరలో సమసిపోతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఎమ్మెల్యే పోచారం, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి పై మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. డీసీసీ అధ్యక్షునికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరగకుండా సామరస్యంగా సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆదివారం కొండా వర్గం రేవూరి వర్గం మధ్య ఫ్లెక్సీల వివాదం చెలరేగింది. దసరా బతుకమ్మ వేడుకల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి పేరు లేకపోవడంతో వివాదం మొదలైంది. ఎమ్మెల్యే పేరు పెట్టాలంటూ కొండ వర్గానికి రేవూరి అనుచరులు సూచించారు. రేవూరి ఫోటో లేకుండా ఫ్లెక్సీలు పెట్టడంతో ఫ్లెక్సీలను చించేశారు. ఫ్లెక్సీలు చించి వేసారంటూ రేవూరి అనుచరులపై కొండ వర్గం దాడికి పాల్పడ్డారు. దీంతో గాయాల పాలైన రేవూరి అనుచరులు కొండ వర్గంపై ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కొండ అనుచరులను అరెస్ట్ చేశారు. ఆధారాలు లేకుండానే తమ కార్యకర్తలను అరెస్ట్ చేశారంటూ కొండ అనుచరులు పేర్కొన్నారు.. గీసుకొండా పోలీస్ స్టేషన్ పరిధిలో 16వ డివిజన్ నర్సంపేట రహదారిపై కొండా వర్గం ధర్నాకు దిగింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న తమ వర్గానికి చెందిన కార్యకర్తలను విడుదల చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ధర్నా చేస్తున్న కార్యకర్తలపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. సమస్య వివాదాస్పదం కాకుండా రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలకు నచ్చచెప్పి ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. ఈ ధర్నాతో మరోసారి కొండ, రేవూరి ఆధిపత్య పోరు మరోసారి బట్టబయలైంది.

## వికసిత భారత్ కోసం బిజెపిలో చేరండి



ధర్మపురి అక్టోబర్ 14 (ప్రజా మంటలు) :
అభివృద్ధి చెందిన భారతదేశ (వికసిత భారత్ ) నిర్మాణం కోసం నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ విశేషంగా కృషి చేస్తోందని యువత మహిళలు పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వం తీసుకొని నరేంద్ర మోడీకి మద్దతుగా నిలువాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ అన్నారు. ధర్మపురి మండలం నక్కల పేట గ్రామంలో మండల అధ్యక్షులు సంగేపు గంగారాం ఆధ్వర్యంలో నూతన సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గా భారత దేశం అంతర్జాతీయ కితాబులను అందుకుంటున్నదని భారతీయ సాంస్కృతిక వైభవాన్ని పునర్ ప్రతిష్టించడంలో నరేంద్ర మోడీ సర్కార్ ఎంతో కృషి చేస్తోందని అన్నారు
బిజెపి జాతీయవాదం జాతీయ సమగ్రత ప్రజాస్వామ్యం గాంధీయ సామ్యవాదం సర్వధర్మ సమభావన విలువలతో కూడిన రాజకీయాల కోసం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ మాజీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం సీనియర్ నాయకులు నలమాసు వైకుంఠం ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్.శక్తి కేంద్రం ఇన్చార్జి గడ్డం శంకర్ బర్గెల మహేష్ కామేర ప్రభాకర్.అల్లూరి శశి.దుర్గం కిరణ్. తాళ్లపెల్లి వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### మార్కెట్ పాలక వర్గానికి జీవన్ రెడ్డి సూచన

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**







ధర్మపురి అక్టోబర్ 14 ( ప్రజా మంటలు) :
రైతులకు సంబంధించిన ప్రతి సమస్య పరిష్కారానికి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం నిరంతర కృషి చేయాలని కాంగ్రెస్ వరిష్ఠ నేత, ఎమ్మెల్సీ తాడిపర్తి జీవన్ రెడ్డి సూచించారు. ధర్మపురి మార్కెట్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సోమవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి ప్రసంగిస్తూ, మార్కెట్ కమిటీ కేవలం ధాన్యం కొనుగోలు గురించే కాక, సాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, రైతు బంధు, బీమా తదితర అంశాలపై దృష్టి నిలిపి, అవసరమున్న వారికి సాయం అందించాలన్నారు. ధాన్యంలో తప్ప తాలు తేమ సమస్యలు రాకుండా రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో లాగ కొనుగోళ్లు జరగాలని ఆకాంక్షించారు. దేశంలో బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా రుణమాఫీ అమలు చేశారా అంటూ, 2లక్షల ఋణ మాఫీ ఏక మొత్తంలో చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. నవంబరు 7లోగా 2లక్షల లోపు ఋణాల మాఫీ పూర్తిగా చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రజల పక్షాన పోరాటాలకు అలవాటు పడిన లక్ష్మణ్ కుమార్ ప్రస్తుతం తన కన్నా ఎక్కువ సమయం ప్రజల మధ్యన గడపడాన్ని అభినందించారు.
ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ తమ సుదీర్ఘ ప్రసంగంలో....కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన వెంటనే 2 లక్షల రూపాయల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రుణాలను మాఫీ చేసి చూపించామని, జగిత్యాల జిల్లాకు సంబంధించి 64వేల రైతులకు 80 శాతం వరకు రుణమాఫీ పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 20 శాతం రైతులకు రుణాలకు మాఫీ చేసి తీరుతామని, ఈ ప్రాంత ఇరిగేషన్ విషయంలో కూడా ఇప్పటికే సంబంధిత శాఖ మంత్రి గారిని కలిసి వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. త్వరలోనే బడ్జెట్ లో ప్రతిపాదించిన విధంగా పత్తిపాక రిజర్వాయర్ ను పూర్తి చేసి రైతాంగానికి నీటిని అందిస్తామని, లిఫ్ట్ లకు కూడా మరమ్మతులు పూర్తి చేయించి తిరిగి వాడుకలోకి తీసుకురావడం జరిగిందని, రోళ్ళ వాగు ప్రాజెక్ట్ కూడా అంచనా వ్యయం పెంచి నప్పటికీ దాన్ని గత ప్రభుత్వంలో పూర్తి చేయలేకపోయారని, దాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఐ టి ఐ, డిగ్రీ కళాశాల, సమగ్ర ఇంటర్ కళాశాల, బస్ డిపో ఏర్పాట్లకు కృషి చేస్తామన్నారు. తన పేరును పి సి సి అధ్యక్ష స్థానానికి పరిశీలనకు అధిష్టానానికి పంపిన సీఎం రేవంత్ రెడ్డికి కృత్ఞతలు తెలిపి, తనకు పదవుల కన్నా ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యమని సీఎంకు విన్నవించామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మార్కెట్ పాలక వర్గం పైన ఉందన్నారు. పీసీసీ సభ్యులు దినేష్ సంగన భట్ల నిర్వహించిన కార్యక్రమంలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, డైరెక్టర్ల చేత జిల్లా మార్కెట్ అధికారి ప్రకాశ్ ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. అనంతరం నూతనంగా నియామకమైన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే,ఎమ్మెల్సీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, వివిధ మార్కెట్ చైర్మన్లు, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నూతన పాలక వర్గాన్ని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లపాటు జైలులో నరకం

- తల్లి అంత్యక్రియలకు కూడా అనుమతి నిరాకరణ
- విషాదంగా ముగిసిన సాయిబాబా జీవితం



కాకినాడ,అక్టోబరు 14 (ప్రజా మంటలు):
అర్బన్ నక్సలైట్ పేరుతో పలువురు మేధావులు జైళ్లలో మగ్గుతున్నారు. అలా మగ్గుతున్న వారిలో ప్రొఫెసర్ సాయిబాబా కాలం చెందారు. వరవరవరావు కూడా సుదీర్ఘకాలం జైలులో మగ్గారు. దాదాపు పదేళ్ల కారాగారం అనుభవిం చారు. దాంతీ తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. తొంభై శాతం అంగవైకల్యం.. మానవ హక్కుల ఉద్యమంలో మమేకం.. పదేళ్ల కారాగార వాసం.. కన్నతల్లి చివరి చూపులకు నోచుకోలేని దైన్యం.. రెండుసార్లు నిరూపితమైన నిర్దోషిత్వం.. ఇదీ శనివారం కన్ను మూసిన ప్రొఫెసర్ గోకరకొండ నాగ(జీఎన్) సాయిబాబా(57) నేపథ్యం. సాయిబాబా, మరో ఐదుగురిపై మోపిన అభియోగాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) వర్తించదని ముంబయి హైకోర్టు తుదితీర్పు ఇచ్చేలోపు ఆయన పదేళ్లపాటు కారాగారం అనుభవించాల్సి వచ్చింది. శనివారం కన్నుమూసిన ప్రొఫెసర్ గోకరకొండ నాగ(జీఎన్) సాయిబాబా(57) నేపథ్యం. సాయిబాబా, మరో ఐదుగురిపై మోపిన అభియోగాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) వర్తించదని ముంబయి హైకోర్టు తుది తీర్పు ఇచ్చేలోపు ఆయన పదేళ్లపాటు కారాగారం అనుభవించాల్సి వచ్చింది. ఏపీలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లిలో రైతు కుటుంబంలో సాయిబాబా 1967లో జన్మించారు. తల్లిదండ్రులు గోకరకొండ సత్యనారాయణమూర్తి, సూర్యావతి. ఐదేళ్ల వయసులో సాయిబాబా కు పోలియో సోకి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నా.. చదువులో వెనుకబడలేదు. అమలాపురంలో డిగ్రీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లిష్ చదివారు. హైదరాబాద్‌లోని ఆంగ్ల, విదేశీ భాషల విశ్వవిద్యాలయం(నాటి సీఫెల్)లో ఎం.ఫిల్. చేశారు. 2003లో ఢిల్లీ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఆంగ్లభాష సహాయ ఆచార్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2013లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1992లో హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్‌లో ఆయన సభ్యులుగా చేరారు. అప్పటి నుంచి మానవ హక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కాగా, ఉపా కేసు నేపథ్యంలో సాయిబాబాను ఢిల్లీ విశ్వవిద్యాలయం 2021లో ఉద్యోగం నుంచి తొలగించింది. మావోయిస్టు పార్టీకి చెందినవారితో కలిసి రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్(ఆర్‌డీఎఫ్) తరఫున సమావేశం ఏర్పాటు చేశారన్న ఆరోపణలపై 2014 మే నెలలో సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు జేఎన్‌యూ విద్యార్థి హేమ్ కేశవాదత్త మిశ్ర, ఉత్తరాఖండ్‌కు చెందిన పాత్రికేయుడు ప్రశాంత్ రాహి, మహేష్ కరిమన్ టిర్కీ, నారాయణ్ సాంగ్లీకర్, విజయ్ టిర్కీలనూ జైలుపాలు చేశారు. కరడు కట్టిన నేరగాళ్లను జైళ్లలోని అండా సెల్‌లో ఉంచుతారు. ఎవరినీ కలవనీయకుండా అలా చేస్తారు. వీల్‌ఛైర్‌కే పరిమితమై.. ఇతరుల సాయం లేకుండా దైనందిన కార్యకలాపాలూ నిర్వహించుకోలేని సాయిబాబాను కరోనా సమయంలో అలాంటి అండా సెల్‌లో ఉంచారు. దీంతో ఆయన నరకం అనుభవించారు. తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఎడమవైపు శరీరమంతా చచ్చుబడిపోయినా చికిత్స చేయించలేదని, నొప్పి నివారణ మాత్రలతో సరిపెట్టారని ఆయన ఆరోపించారు. అంగవైకల్యం, కరోనా ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ఆయనకు బెయిల్ ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతోపాటు పలు పౌరహక్కుల సంఘాలు ప్రభుత్వానికి లేఖలు రాసినా ఫలితం లేకపోయింది. వైకల్యం, ఇతర సమస్యల కారణంగా సాయిబాబా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో 2015 జూన్‌లో ముంబయి హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబరులో బెయిల్ రద్దు కావడంతో మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 2016 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు మరోమారు బెయిల్ మంజూరు చేసింది. కానీ, 2017 మార్చిలో ఉపా చట్టం కింద సాయిబాబాను దోషిగా ప్రకటించి.. జీవితఖైదు విధిస్తూ మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. దాంతో సాయిబాబాతోపాటు ఇతర నిందితులను నాగ్‌పూర్ కేంద్ర కారాగారానికి తరలించారు. గడ్చిరోలి కోర్టు తీర్పుపై విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. 2022 అక్టోబరు 14న ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును మర్నాడే సుప్రీంకోర్టు నిలిపివేసింది. పునర్విచారణ జరపాలని హైకోర్టును ఆదేశించింది. మళ్లీ విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. 2024 మార్చి 5న సాయిబాబా తదితరులను నిర్దోషులుగా ప్రకటించింది. కేసులో సమర్పించిన సాక్ష్యాలు నమ్మశక్యంగా లేవని పేర్కొంది. 2014 నుంచి 3,588 రోజులపాటు జైలులోనే ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. నరాలు దెబ్బతినడం, కాలేయ సమస్యలు, బీపీ తదితర సమస్యలు చుట్టుముట్టాయి. వీటితోపాటు హృద్రోగ సమస్యలు కూడా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు విప్లవ రచయితర సంఘం (విరసం) నేత వరవరరావు ఆరోగ్యం దెబ్బతినడంతో వారి బంధువులు, అభిమానుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఆ తర్వాత 2022 అక్టోబర్‌లో బాంబే హైకోర్టులోని నాగ్‌పూర్ బెంచ్ సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడంతో సాయిబాబా విడుదలపై సుప్రీంకోర్టు 2022 అక్టోబర్‌లో స్టే ఇచ్చింది. ఆ కేసులో మహారాష్ట్ర సర్కారు వాదనను తిరిగి వినాలని బాంబే హైకోర్టుకే రిఫర్ చేసింది. దీంతో ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు ఆయనను మరోసారి నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

మార్చి 7న నాగ్‌పూర్ కేంద్ర కారాగారం నుంచి ఆయన విడుదలయ్యార. కోర్టు తీర్పు నేపథ్యంలో సాయిబాబా .. హైదరాబాద్‌లో భార్య వసంత, కుమార్తె మంజీరాతో కలిసి నివాసం ఉంటున్నారు. జైల్లో ఉండగానే 'నేను చావును నిరాకరిస్తున్నాను', 'వై డు యూ ఫియర్ మై వే సోమచ్' పేరుతో కవితలు, లేఖలతో సాయిబాబా సంకలనం రచించారు. వైకల్యం ఉన్న తనను ఎంతో జాగ్రత్తగా పెంచిన తల్లికి అనారోగ్యంగా ఉందని, ఆమెను చూసేందుకు వెళ్లడానికి పెరోల్ ఇవ్వాలని వేడుకున్నా ఎవరూ పట్టించు కోలేదని, చివరికి కన్నతల్లి చనిపోయిన తర్వాత చివరి చూపులకు, కర్మకాండలకు హాజరయ్యేందుకూ అనుమతి లభించలేదని జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ సందర్భంలో ఆయన వాపోయారు.

## వాగులు, చెరువులపై దృష్టి పెట్టాలి

**వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలి**

**వర్షాల నేపథ్యంలో సిఎం చంద్రబాబు సమీక్ష**

**ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్న మంత్రి నిమ్మల**

అమరావతి,అక్టోబర్14 (ప్రజా మంటలు):
ఆకస్మికంగా వచ్చే వరదల కారణంగా రైల్వే లైన్‌లు, సమీపంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. వాగులు, చెరువులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్ష సూచన నేపథ్యంలో నీటిపారుదల శాఖపై మంత్రి రామానాయుడితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుంగభద్ర, శ్రీశైలం, సోమశిల తదితర ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, ప్రకాశం, సత్య సాయి, అనంతపురం, చిత్తూరు సహా వివిధ జిల్లాల్లో వాగులు, కాలువల క్యాచ్‌మెంట్ ఏరియాల్లో వరద నీటిని అంచనా వేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు.సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశాం. ఇంకా కొన్ని జిల్లాల్లో రిజర్వాయర్లు నింపాల్సి ఉంది. గత ఐదేళ్లలో చాలా ప్రాజెక్టులను సరిగా నిర్వహించలేకపోయారు. కనీసం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు కూడా జగన్ ప్రభుత్వం కేటాయించలేకపోయింది. నవంబర్ నెల నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల మరమ్మతులు, ఇతర పనులు చేపడతాం. పోలవరం పనులపై వర్క్ క్యాలెండర్ రూపొందిస్తున్నాం. డయాఫ్రం వాల్ పనులు కూడా నవంబర్ నెల నుంచే ప్రారంభం అవుతాయి. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. భారీ వర్ష సూచనతో ప్రభుత్వం అలెర్ట్ అయిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. భారీ వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు. ప్రాజెక్టుల్లో ఇన్ ఫ్లోస్ మీద ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. సోమశిల రిజర్వాయరుకు గతంలో ఎన్నడు రానంత వరద ఈ సారి వస్తోందన్నారు. ముందుగానే చెరువులు, వాగులు, రిజర్వాయర్లు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ఇటీవల కాలంలో అకస్మాత్తుగా వరదలు వస్తున్నాయని పేర్కొన్నారు. వరదలు వచ్చినా ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, కడప వంటి జిల్లాల్లో వాగుల్లో ప్రవాహాలను పరిశీలిస్తున్నామన్నారు. వాగుల పరివాహక ప్రాంతాల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే 24 గంటల్లో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. ఆర్టీజీఎస్ సహకారంతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని మంత్రి చెప్పారు. ఇంకా కొన్ని జలశయాల్లో నీరు నింపలేని పరిస్థితి నెలకొందని.. గత ఐదేళ్ల పాపం రాష్ట్రాన్ని పీడిస్తోందని విమర్శించారు. పెన్నా బేసిన్లోని రిజర్వాయర్లల్లో నీటిని నింపలేక పోతున్నామన్నారు. గత ఐదేళ్లల్లో ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేశారని.. ప్రతికూల పరిస్థితుల్లో కూడా రిజర్వాయర్లల్లో నీటిని నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏపీలోని రిజర్వాయర్లల్లో మొత్తంగా 760 టీఎంసీల కెపాసిటీతో నీటిని నిల్వ చేయొచ్చని వెల్లడించారు. ప్రస్తుతం 680 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామన్నారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

# నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడేనా?

**రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు**

**ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులు**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
హైదరాబాద్ నగరం విస్తరించడంతో పాటు, శివారు గ్రామాలు అన్నీ నగరంలో కలసిపోతున్నాయి. దీనికితోడు గ్రామాల్లో ఉపాధి లేక ప్రజలు బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వస్తున్నారు. దీనికితోడు టూ వీలర్, కార్లు తప్పనిసరిగా కొనుగోలు చేస్తున్నారు. వీటి ఉపయోగం పెరుగుతోంది. కరోనా తరవాత సొంత వాహనాల్లో వెళ్లడం అలవాటు చేసుకున్నారు. మెట్రో అందుబాటులోకి వచ్చినా ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడడం లేదు. మరోవైపు హైదరాబాద్ నగరం విస్తరించడంతో పాటు, అందుకు మించి అన్నట్లుగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. నగర రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఓ గంటలో గమ్యం చేరుకుంటామన్న భరోసా కలగడం లేదు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయలేక పోతున్నారు. దీనికితోడు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో పోలీసులు అలసత్వం కూడా తోడవుతోంది. దీంతో నిత్యం నగర జీవనం దుర్భరంగా మారుతోంది. అంబులెన్సులు కూడా పరుగెత్తలేని పరిస్థితి ఏర్పడింది. శని,ఆదివారాల్లో కడూఆ ట్రాఫిక్ తగ్గడం లేదు. మెహదీపట్నం నుంచి ఐటి కారిడార్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి. వేలాది ఐటీ కంపెనీలు.. రోజుకు సుమారు 15,20 లక్షల మంది వాహనదారులు రాకపోకలు సాగించే అత్యధిక రద్దీ ప్రాంతం.. కావడంతో ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు కొదువ లేదు. దీనికి చెక్ పెట్టడానికి సైబరాబాద్ పోలీసులు అనేక కార్యక్రమాలను చేపడుతు న్నారు. తాజాగా ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉన్న, అత్యధికంగా వాహనాల రాకపోకలు సాగించే ముఖ్యమైన జంక్షన్‌ల వద్ద సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పుడున్న రోడ్లను విస్తరించి, ప్రత్యేకంగా ఫ్రీ లెఫ్ట్ వెల్లడానికి సరిపడా రోడ్లను విస్తరిస్తున్నారు. గచ్చిబౌలి ఐటీ జంక్షన్ వద్ద గచ్చిబౌలి పీఏఎస్ ఎంట్రెన్స్ నుంచి పోలీస్‌స్టేషన్‌లో పార్కింగ్ స్థలాన్ని తొలగించి ఐఐటీ జంక్షన్ వరకు అతిపెద్ద రోడ్డుగా విస్తరిస్తున్నారు. దాంతో సైబరాబాద్ సీపీ కార్యాలయం, ఓఆర్ఆర్ నుంచి గచ్చిబౌలి, ÷నాన్షియల్ డిస్టిక్ట్రకు వెళ్లేవారు ఐఐఐటీ జంక్షన్ వద్ద సిగ్నల్ కోసం ఆగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక రోడ్డును నిర్మిస్తున్నారు. అంతేకాకుండా హెచ్‌సీయూ నుంచి వచ్చే ట్రాఫిక్ ఐఐఐటీ జంక్షన్ వద్ద ఆగకుండా లెఫ్ట్‌వెళ్లేవారు, నేరుగా వెళ్లేవారు సిగ్నల్ కోసం ఆగకుండా, జంక్షన్ వద్ద వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ÷నాన్షియల్ డిస్టిక్ట్ర నుంచి రాయదుర్గం వైపు వెళ్లాలనుకునేవారు. ఐఐఐటీ వద్ద లెఫ్ట్ తీసుకొని, స్టేడియం వద్ద యూటర్న్ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా రాయదుర్గం నుంచి షేక్‌పేట÷÷-లవోవర్ వరకు, ఐకియా నుంచి హైటెక్‌సిటీ వరకు అక్కడి నుంచి మాదాపూర్ యశోద ఆస్పత్రి వరకు సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌లు అందించడానికి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నారు. బయోడైవర్సిటీ వద్ద సిగ్నల్ ఫ్రీ జంక్షన్ ఏర్పాటు చేసి ఎలా సక్సెస్ అయ్యారో ముఖ్యమైన జంక్షన్‌ల వద్ద అదే పద్ధతి కొనసాగించడానికి పోలీసులు కసరత్తు చేస్తున్నారు. మరో 20 రోజుల్లో సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణ కు ఇప్పటికే హైరైజ్ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఏ చిన్న ట్రాఫిక్ జామ్ ఏర్పడినా, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వెంటనే ట్రాఫిక్ పోలీసులకు తెలిసేలా కెమెరాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ (పీఎస్ ఐవోసీ)కి అనుసంధానం చేశారు. అక్కడి నుంచి సిబ్బంది ట్రాఫిక్‌ను మానిటరింగ్ చేస్తారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ సైతం పరిస్థితిని సమీక్షించేలా ఆయన కార్యాలయానికి కనెక్ట్ చేశారు. ఇటీవల భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌ల ఏర్పాటు సైతం సత్ఫలితాలు ఇస్తాయని, ఎన్నాళ్లుగానో ఉన్న ఐటీ కారిడార్ ట్రాఫిక్ కష్టాలు తీరిపోతాయని సైబరాబాద్ ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూరా సిగ్నల్ ఫ్రీ ప్రయాణాలు సాగేలా అండర్‌పాస్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్నది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వైపు నుంచి కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వైపు 740 మీటర్ల మేర అతిపెద్ద భూగర్భ మార్గం నిర్మించనున్నారు. దీంతో ఐటీ కారిడార్, ఫిల్మ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు జూబ్లీ చెక్‌పోస్ట్ కంటే ముందు ఉండే అండర్‌పాస్ నుంచి సిగ్నల్ చిక్కులు లేకుండా రాకపోకలు సాగించే వెసులుబాటు కలగనుంది. మూడు లేన్లుగా అండర్ పాస్ నిర్మాణానికి రూపకల్పన చేశారు. అలాగే సిగ్నల్ చిక్కులు లేకుండా జంక్షన్ల వారీగా బహుళ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. జూబ్లీ చెక్‌పోస్ట్ వద్ద మాత్రం రెండో లెవల్‌లో ఓ వంతెన ప్రతిపాదించారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ చౌరస్తా వద్ద రూ.192 కోట్లతో రెండు అండర్‌పాస్‌లు, ఓ వంతెన ప్రతిపాదించారు. యూసుఫ్‌గూడ వైపు నుంచి వచ్చే వాహనాలు మూడు లేన్ల వంతెన నుంచి జూబ్లీచెక్‌పోస్ట్ వైపు వెళ్లనున్నాయి. జూబ్లీచెక్‌పోస్ట్ నుంచి వచ్చే వాహనాలు ఫ్రీ లెఫ్ట్ ద్వారా యూసుఫ్‌గూడ వైపు, కేన్సర్ ఆస్పత్రి వైపు వెళ్లాల్సిన వాహనాలు అండర్‌పాస్ వినియోగించాల్సి ఉంటుంది. జూబ్లీచెక్‌పోస్ట్ వద్ద రెండు వంతెనలు, ఓ అండర్‌పాస్ నిర్మించనున్నారు. ఇందుకు రూ.229 కోట్లు అవసరమని అంచనా వేశారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ ?36 (పెద్దమ్మ గుడి వైపు) మూడు లేన్ల చొప్పున రెండు వైపులా వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఆరు లేన్ల వంతెన అందుబాటులోకి రానుంది. రోడ్ నెంబర్?45 వైపు నుంచి కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు వెళ్లేందుకు మూడు లేన్ల అండర్‌పాస్, యూసుఫ్‌గూడ వైపు వాహనాల కోసం మరో అండర్‌పాస్ ప్రతిపాదించారు. కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ఓ అండర్‌పాస్, ఓ వంతెనను రూ.83 కోట్లతో ప్రతిపాదించారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ నుంచి మహారాజ అగ్రసేన్ చౌరస్తా వైపు వెళ్తాయి. అగ్రసేన్ చౌరస్తా వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ నుంచి జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఫిల్మ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనదారులు వంతెన మీదుగా మహారాజ అగ్రసేన్ జంక్షన్ వైపు వెళ్లే అవకాశం కలుగుతుంది. ఇలా ట్రాఫిక్ క్రమబద్దీకరణకు రకరకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చేయడం మరో ఎత్తు కావాలి. టూ వీలర్స్, ఆటోలకు ప్రత్యేక లైన్లు ఉంటే తప్ప కార్లు, బస్సులు సాఫీగా ముందుకు వెళ్లలేవు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com